
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 13 అక్టోబరు 2025

పారిశ్రామిక ప్రగతి!

గిలకలదిండిలో ఎంఎస్ఎంఈ పార్క్!

200 ఎకరాల కేటాయింపునకు రంగం సిద్ధం

మచిలీపట్నంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. గిలకలదిండి వద్ద ఎంఎస్ఎంఈ పార్క్ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా ఈ పార్కు ఏర్పాటు కోసం గిలకలదిండిలో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మత్స్య ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్‌లను అధికశాతం ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. వీటి ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

- సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్‌ల ఏర్పాటుకు అవకాశం
- మచిలీపట్నం పాత రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు, సర్వే పూర్తి
- కరగ్రహారంలోనూ మరో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదన


గిలకలదిండి హార్బర్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గిలకలదిండి హార్బర్ నుంచి 90కిపైగా సోనా బోట్లు, 700లకుపైగా ఫైబర్ బోట్లు చేపల వేటను కొనసాగిస్తున్నాయి. ఇక్కడ నుంచి ఏడాదికి సరాసరిన 2.35 లక్షల టన్నులకు పైగా చేపలు, రొయ్యలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కులో చేపలు, రొయ్యలకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్‌లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసేలా ప్రణాళికను రూపొందిస్తున్నారు. గిలకలదిండిలో ఇప్పటి వరకు మత్స్యసంపదకు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్‌లు లేకపోవడంతో సముద్రంలో దొరికిన మత్స్యసంపదను వేరే ప్రాంతాలకు తరలించి అక్కడ ప్రాసెసింగ్ చేస్తున్నారు.

పాత రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం

గిలకలదిండి హార్బర్‌కు వెళ్లాలంటే నగర శివారున ఉన్న మచిలీపట్నం పాత రైల్వే స్టేషన్ పక్క నుంచి వెళ్లాలి. మచిలీపట్నం పోర్టు నిర్మాణం చేస్తుండటంతో గతంలో పాత రైల్వేస్టేషన్ నుంచి గిలకలదిండి వరకు ఉండి, ఉపయోగించని రైల్వేలైన్‌ను రెండేళ్ల క్రితమే పునరుద్ధరించారు. దీంతో ఇక్కడి నుంచి రైలు మార్గం ద్వారా కూడా మత్స్య ఉత్పత్తులు, ఇతరత్రాలను రవాణా చేసేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేసినట్లయింది. పాత రైల్వేస్టేషన్ వద్ద నుంచి గిలకలదిండికి వెళ్లే రహదారి క్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం మిగతా 6లో..


కరగ్రహారంలో మరో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదన

కరగ్రహారంలో ఎంఎస్ఎంఈ పార్కుకు సంబంధించి భూసేకరణ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రెవెన్యూ అధికారులకు అందాయి. ఈ నేపథ్యంలో భూసేకరణకు అనువైన స్థలం వెతికే పనిలో రెవెన్యూ అధికారులు ఉన్నారు. గిలకలదిండి హార్బర్ నుంచి సముద్ర తీరం వెంబడి కరగ్రహారం గ్రామం వరకు తక్కువ దూరం ఉంటుంది. గిలకలదిండి నుంచి కరగ్రహారం గ్రామానికి వెళ్లేందుకు నూతన రహదారి నిర్మాణం కోసం ఇటీవల సర్వే చేశారు. రహదారి నిర్మాణం జరిగే ప్రాంతలోని భూములలో మడ అడవులు ఉండటంతో రహదారి నిర్మాణం కోసం పర్యావరణ అనుమతుల నిమిత్తం ఫైలును పంపారు. ఈ అనుమతులు వస్తే గిలకలదిండి నుంచి కరగ్రహారం వరకు రహదారి నిర్మాణం జరగనుంది. గిలకలదిండి నుంచి మత్స్య ఉత్పత్తులను కరగ్రహారం మీదుగా పోర్టుకు తరలించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఎంఎస్ఎంఈ పార్కు వస్తే ఇవీ ప్రయోజనాలు

ఎంఎస్ఎంఈ పార్కును గిలకలదిండిలో ఏర్పాటు చేస్తే మత్స్య ఉత్పత్తులకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్‌లు ఇక్కడ ఏర్పాటవుతాయి. పరిశ్రమలు స్థాపించే వారికి భూముల కేటాయింపులో రాయితీలు ఇస్తారు. విద్యుత్‌సరఫరా, రహదారుల నిర్మాణం వేగవంతమవుతుంది. ఇక్కడ ఐస్‌ప్లాంట్‌ల నిర్మాణం, ప్యాకింగ్, రవాణా యూనిట్లను ఏర్పాటు చేస్తారు. ఇంత కాలంగా పనికి రాకుండా ఉన్న భూములు వినియోగంలోకి వస్తాయి. దీంతో పాటు మత్స్యఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మచిలీపట్నంలోని ఏటీఎస్ కేంద్రం (ఫైల్)



ఏటీఎస్‌తో ఇక్కట్లు

ఏజెంట్ ఉంటే ఫిట్‌నెస్ టెస్ట్ పాస్

- లేకుంటే ఫెయిల్ అవుతున్న టెస్ట్‌లు
- ఇబ్బందుల్లో వాహన యజమానులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్)లో వాహన యజమానులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఏజెంట్ ఉంటేనే ఫిట్‌నెస్ టెస్ట్ పాస్ అవుతుంది. లేకపోతే ఫెయిల్ అవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో ఆర్టీవో కార్యాలయాల్లో బ్రేక్ చేసుకునేవారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలంటే సులువుగా ఉండేది. ఇప్పుడు డబ్బుతో పాటు సమయం వృథా అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

గుడివాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వాహనాల ఫిట్‌నెస్ నిమిత్తం ఏటీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా వాహన దారులు తమ వాహనాలకు ఫిట్‌నెస్ చేయించుకోవాలంటే మచిలీపట్నంలోని ఈ కేంద్రానికి వెళ్లాల్సిందే. దీంతో డబ్బుతో పాటు సమయం వృథా అవుతుందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ నెల 8వ తేదీన గుడివాడ నుంచి వాహనదారుడు ఖాసిం ఆన్‌లైన్‌లో రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నాడు. తన ట్రక్ ఆటోను బ్రేక్ కోసం ఏటీఎస్ కేంద్రానికి వెళితే స్మోక్ టెస్ట్‌లో ఫెయిల్ చేశారు. అదే వాహనదారుడు తిరిగి ఆన్‌లైన్‌లో రూ.1,700 చెల్లించి మిగతా 6లో..

వెళ్లాలంటే ఇబ్బందులే..

జిల్లా వ్యాప్తంగా వాహనదారులు మచిలీపట్నంలోని ఏటీఎస్ కేంద్రానికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. గన్నవరం మండలం శివారు ప్రాంతానికి చెందిన వాహనదారులు మచిలీపట్నం వెళ్లాలంటే సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణించాలి. వెళ్లిన అదే రోజున ఫిట్‌నెస్ పూర్తవుతుందనే నమ్మకం లేదు. అదే రోజున బ్రేక్ కాని పక్షంలో తిరిగి రెండో రోజు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి వెళ్లాల్సిందే. వాహనదారులకు డబ్బుతో పాటు సమయం వృథా అవుతుంది.

గన్నవరం విమానాశ్రయంలో జనార్దనరావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)



వివాదాల జనార్దన!

హైదరాబాద్‌లోని ఈ సెవెన్ బార్‌లో భాగస్వాముల మధ్య వివాదాలు

- జనార్దనరావు పెత్తనాన్ని సహించని భాగస్వాములు
- అక్కడ బార్‌ను వదిలేసి వచ్చి.. ఇక్కడ ఏఎన్ఆర్ బార్‌ను సంపాదించాడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిరాణా వ్యాపారం నుంచి బార్‌లు నిర్వహించే స్థాయికి ఎదిగిన జనార్దన రావు కోట్ల సంపాదన కోసం కోటి ఉపాయాలను ఎంచుకున్నాడా? లిక్కర్ వ్యాపారం చేసే వాళ్లందరినీ ఒక సిండికేట్‌గా మార్చడంలో సఫలీకృతమయ్యాడా? దాని ముసుగులోనే నకిలీ మద్యం తయారీని అన్ని ప్రాంతాలకు విస్తరింపజేయాలని భావించాడా? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తుంది. 2021 నుంచి పరుగులు తీసిన జనార్దనరావు జాతకం తెలంగాణలోని బార్ నిర్వహణలో భాగస్వాములు మధ్య వచ్చిన వివాదంతో తిరగబడింది. మొత్తం తన బావతో కలిసి ఏడుగురు భాగస్వాములతో హైదరాబాద్‌లో ఈ సెవెన్ బార్‌ను ఏర్పాటు చేశారు. ఇది కొంతకాలం బాగానే నడిచింది. తర్వాత భాగస్వాముల మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. భాగస్వాముల్లో ఒకరైన షరీఫ్ అనే వ్యక్తి మొత్తం బాధ్యతలను నిర్వహించేవాడు. వ్యాపారం సాగుతున్న భాగస్వామికి ఇవ్వాల్సిన లాభాలు ఇచ్చేవాడు కాదు. దీంతో జనార్దనరావు గొడవ చేయడం మొదలుపెట్టాడు. భాగస్వాములకు వచ్చిన లాభాలను పంచకపోతే ఎలా అంటూ మిగిలిన వారిని రెచ్చగొట్టేవాడు. ఈ క్రమంలోనే షరీఫ్‌కు జనార్దనరావుకు మధ్య వివాదం జరిగింది. జనార్దనరావుకు బార్‌తో సంబంధం లేకుండా షరీఫ్ చేశాడు. ఈ పంచాయతీని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఒక ఎమ్మెల్యే చేసినట్టు తెలిసింది. ఆ తర్వాత జనార్దనరావు హైదరాబాద్‌లో బార్‌ను వదిలేసి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏఎన్ఆర్ బార్‌ను సంపాదించాడు.

గోవా కథ..

ఈ సెవెన్ బార్‌లో భాగస్వాములుగా ఉన్న వాళ్లంతా కలిసి గోవా వెళ్లామని, అక్కడ బాలాజీ అనే వ్యక్తి పరిచయం అయిన తర్వాత నకిలీ మద్యం తయారీకి ప్రణాళికలు రూపొందించామని జనార్దనరావు ఎక్సైజ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. దీని ప్రకారం భాగస్వాముల్లో కొంతమంది మాత్రమే గోవాకు వెళ్లారని తెలుస్తోంది. గోవా పర్యటనతో సంబంధంలేని భాగస్వాములను ఈ కేసులోకి లాక్కొచ్చే ప్రయత్నం చేశాడు. వైసీపీ హయాంలో అనేక రకాల బ్రాండ్ల మద్యం దుకాణాల్లోనూ బార్లలోనూ కనిపించాయి. ముఖ్యంగా ఈ ఏఎన్నార్ బార్‌లో డిపోల నుంచి కొనుగోలు చేసినటువంటి మద్యానికంటే నకిలీ మద్యాన్ని ఎక్కువగా విక్రయించినట్లు తెలుస్తోంది.

కొత్త టీచర్లకు సత్కారం 6

అమరావతి కేంద్రంగా..

ఇక సీఆర్‌డీఏ పాలన

నేడు సీఎం చేతుల మీదుగా ప్రధాన కార్యాలయం ప్రారంభం

- రాష్ట్ర ప్రజలందరికీ ఇక్కడి నుంచే సేవలు
- ఉమ్మడి కృష్ణాజిల్లా ప్లానింగ్, ఇంజనీరింగ్ తదితర శాఖల పాలన బెజవాడ నుంచే..
- విజయవాడలో అడిషనల్ కమిషనర్ స్థాయి అధికారి ఉండే అవకాశం!

అమరావతి కేంద్రంగా ఇక పుర పరిపాలన ప్రారంభం కాబోతోంది. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థతో సహా మునిసిపల్ పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో పనిచేయాల్సిన అన్ని శాఖలు ఒకే భవనంలోకి రానున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాన్ని సీఎం చంద్రబాబు సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. ఇక రాష్ట్ర ప్రజలందరికీ ఇక్కడి నుంచే సేవలు అందనున్నాయి.


ప్రారంభోత్సవానికి సిద్ధమైన సీఆర్‌డీఏ కార్యాలయ భవనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని రైతులు, ప్రజలకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ కూడా అమరావతి కేంద్రంగా పుర పాలన అందుబాటులోకి రాబోతోంది. సీఆర్‌డీఏ ప్రధాన పరిపాలనా వ్యవహారాలన్నీ కూడా విజయవాడ నుంచి కాకుండా ఇక అమరావతి నుంచి జరగనున్నాయి. రాజధాని రైతులు తమ సమస్యలకు సంబంధించి ఇప్పటి వరకు విజయవాడ రావాల్సి వచ్చేది. ఇక మీదట తమ స్థానిక ప్రాంతంలోనే కార్యాలయం ఉండటం వల్ల వారికి సౌకర్యంగా ఉంటుంది. అమరావతికి భూములిచ్చిన రైతులకు దగ్గరగా సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ఉంది. ఇప్పటి వరకు రాజధాని ప్రాంత ప్రజలు, రైతులు తమ సమస్యలను చెప్పు కోవడానికి విజయవాడ రావాల్సి వచ్చేది. ఇకమీదట స్థానికంగానే సీఆర్‌డీఏ కార్యాలయం అందుబాటులో ఉండటం వల్ల రాజధాని అపరిష్కృత అంశాల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటి మిగతా 6లో..

సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే మునిసిపల్ శాఖల హెచ్‌వోడీలు

సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే మునిసిపల్ శాఖలకు చెందిన అన్ని హెచ్‌వోడీ కార్యాలయాలు పనిచేయనున్నాయి. సీఆర్‌డీఏ ప్రధాన భవనం ఈ3 - ఎన్ 11 రోడ్ల జంక్షన్ దగ్గర రాయపూడిలో మొత్తం 4.32 ఎకరాల విస్తీర్ణంలో జీప్లస్ + 7 విధానంలో నిర్మించారు. మొత్తం 3.07 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం పూర్తయింది. ప్రధాన భవనం 0.73 ఎకరాలు, గ్రీన్ జోన్ 0.88 ఎకరాలు, పార్కింగ్ ఏరియా 1.36 ఎకరాలు, ఓపెన్ స్పేస్ 0.96 ఎకరాలు, ఎస్టీపీ 0.39 ఎకరాలలో నిర్మాణం చేశారు.

ఇతర శాఖలకు..

ప్రధాన బిల్డింగ్ పక్కనే ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ ఏరియాతో కలిపి మరో నాలుగు భవనాలు నిర్మించారు. ఒక్కో భవనాన్ని 41,500 చదరపు అడుగుల విస్తీర్ణం చొప్పున మొత్తం 1,66,000 విస్తీర్ణంలో నిర్మించారు. మొదటి భవనాన్ని టిడ్కో, ఏపీయూఎఫ్ఐడీసీలకు కేటాయించారు. రెండవ భవనాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రెరా అప్పీలేట్ అథారిటీ, గ్రీనింగ్ కార్పొరేషన్‌లకు కేటాయించారు. మూడవ భవనాన్ని డీటీసీపీ (టౌన్‌ప్లానింగ్), రెరాలకు కేటాయించారు. నాల్గవ భవనాన్ని మెప్మా కార్యాలయానికి కేటాయించారు.

సాయి మణిదీప్, శ్రీ సాకేత్, జీవన్ సాత్విక్(ఫైల్)



కొంపముంచిన ఈత సరదా

చీరాలలోని వాడరేవు సముద్రతీరంలో ప్రమాదం

అమరావతి విట్ కళాశాల విద్యార్థులు ముగ్గురు మృతి

చీరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వాడరేవు సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన ముగ్గురు విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... అమరావతి విట్ కళాశాలలో సాయి మణిదీప్(20), శ్రీసాకేత్(20), జీవన్ సాత్విక్(20) ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారాంతం కావడంతో మరో నలుగురు మిత్రులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వచ్చారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అయితే మణిదీప్ కాస్తంత లోతుకు వెళ్లి ఈత కొడుతుండగా, అప్పటికే సహచరులు అతడిని హెచ్చరించారు. అయిన అలాగే వెళుతుండటంతో అతడిని బయటకు తెచ్చేందుకు ఇద్దరు మిత్రులు దగ్గరకు వెళ్లారు. అయితే ఒక్కసారిగా అలల తాకిడి పెరగడంతో ముందు మణిదీప్ గల్లంతయ్యాడు. అతడిని రక్షించే క్రమంలో ఇద్దరు కూడా గల్లంతయ్యారు. అయితే ముగ్గురు స్నేహితులు ఒక్కసారిగా ప్రమాదంలో పడటంతో మిగిలిన వారు వెంటనే మెరైన్ పోలీసులకు, గజ ఈతగాళ్లకు సమాచారం అందించారు. వారు వెతుకుతుండగా, ముగ్గురి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ 6

- మాజీ మంత్రి దేవినేని ఉమా కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కొండయ్యకు కొద్దిరోజుల క్రితం ఫోన్ చేసి జెడ్పీటీసీ సీటు విషయం గురించి అడిగారు. తర్వాత కొండయ్యకు అనుమానం వచ్చి నేరుగా దేవినేని ఉమా వద్దకు వెళ్లి విషయం చెప్తే అది నకిలీ వీడియో కాల్ అని తేలింది. మూడు రోజుల క్రితం జరిగిన ఘటన ఇది.
- తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో టీడీపీ నాయకుడికి జెడ్పీటీసీ టికెట్ ఇచ్చే విషయమై దేవినేని ఉమా ఏఐ వీడియోను ఉపయోగించుకున్నాడు ఓ నిందితుడు. ఆ వీడియోను ఉపయోగించుకుని హోటల్‌లో మీటింగ్ ఏర్పాటు చేసి మరీ ఏకంగా డబ్బులు కొట్టేశారు.
- ఈ రెండు ఘటనలకు మధ్య వ్యత్యాసం రెండు, మూడు రోజులు మాత్రమే. ఈ ఘటనలో ఒకరు డబ్బులు పోగొట్టుకుంటే, మరొకరు డబ్బులు ఫోన్ చేయడానికి సిద్ధమై వెనక్కి తగ్గారు. ఇప్పటి వరకు వేర్వేరు మార్గాల్లో జనానికి టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు రాజకీయాల్లో ఉన్న ఆశావహులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రముఖ నేతల ఫొటోలతో నకిలీ వీడియోలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం టెక్నాలజీకి పదును పెడుతున్నారు. ఈ తరహా వీడియోల సృష్టికి లిప్ సింక్ ఏఐ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో సైబర్ క్రైం పోలీసులు ఈ విషయాన్ని గుర్తించారు.

లిప్ సింక్ చేస్తున్నారు..!

ఏఐ వీడియోలకు లిప్‌సింక్ అనుసంధానం

- ప్రముఖుల ముఖాలతో నకిలీ వీడియోల సృష్టి
- రాజకీయ ఆశావహులను బురిడీ కొట్టిస్తున్న 'ఈ' నేరగాళ్లు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సైబర్ నేరగాళ్లు ఇప్పుడు రాజకీయాల్లో ఉన్న ఆశావహులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రముఖ నేతల ఫొటోలతో నకిలీ వీడియోలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం టెక్నాలజీకి నేరగాళ్లు పదును పెడుతున్నారు. ఈ తరహాలో వీడియోల సృష్టికి లిప్ సింక్ ఏఐ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో సైబర్ క్రైం పోలీసులు ఈ విషయాన్ని గుర్తించారు.

లిప్ ఇలా సింక్ అవుతోంది..

సైబర్ నేరగాళ్లు వదులుతున్న వీడియోలు వాస్తవంగా ఆ వ్యక్తే మాట్లాడుతున్నట్టే ఉంటున్నాయి. వాస్తవానికి అందులో ఎవరూ మాట్లాడడం లేదు. వీడియోలో ఉన్న వ్యక్తి పెదవులు మాత్రమే కదులుతాయి. డబ్బులు దోచుకోవడానికి వ్యక్తులను టార్గెట్ చేసుకున్న తర్వాత వారిని బుట్టలో వేయడానికి ఎవరో ఒక ప్రముకుడిని ఎంచుకుంటారు. మాట్లాడించే వ్యక్తి ఫొటోను లిప్ సింక్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అవతలి వ్యక్తితో ఏం మాట్లాడాలో దానికి సంబంధించిన ఆడియో యాప్‌లోకి పంపుతారు. ఇలా పంపిన తర్వాత రెండు విధానాలు ఉంటాయి. అందులో ఒకటి ఇన్‌పుట్ వీడియో, రెండో ఆడియో ఇన్‌పుట్ నేరగాళ్లు తీసిన వీడియోలను ఇన్‌పుట్ వీడియో ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీడియోకు సింక్ చేయాల్సిన ఆడియో, వాయిస్ రికార్డింగ్, పాటను ఆడియో ఇన్‌పుట్ ద్వారా ఎంచుకుంటారు. ఏఐ వాటిని డీప్ లెర్నింగ్ మోడల్స్‌కి మార్చుతుంది. వీడియోకు సరిపడినట్టుగా పెదవుల కదలికలను సర్దుబాటు చేస్తోంది. అంతిమంగా వీడియోలో ఉన్న వ్యక్తి మాట్లాడుతున్నట్టుగా, మిగతా 6లో..





క్యూలలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి పై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం తెల్లవారుజామునుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో వీకే శీనానాయక్, దుర్గగుడి పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. ఉదయం 10.30 నుండి అంతరాలయ దర్శనం నిలుపుదల చేసి అందరికీ సర్వదర్శనం ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ రెండు వైపులా భక్తులు తరలిరావడంతో అన్ని దర్శనం టిక్కెట్లు రద్దు చేస్తున్నట్టు ఈవో ప్రకటించారు. అన్ని వైపులా భక్తులు నిండిపోవడంతో వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాష్ ఆధ్వర్యంలో అదనపు పోలీసు సిబ్బందిని నియమించారు. కొండ దిగువన, కొండపైన ట్రాఫిక్ క్లియర్ చేశారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, అన్నప్రసాదం సత్వరం అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత

దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భక్తురాలు లావణ్య తన నాలుగేళ్ల కుమారుడితో ఆదివారం వచ్చింది. కుమారుడు శశివజ్ర ఆరూష్ మహామండపం 7వ అంతస్తులో తల్లి నుంచి రద్దీలో తప్పిపోయాడు. దీంతో ఆమె కన్నీరు మున్నీరయ్యారు. సీఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఫైర్ డిపార్టుమెంట్‌కు చెందిన ఏఎస్ఐ ఆర్వీ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని లిఫ్ట్ వద్దకు రాగా ఏడుస్తున్న బాలుడిని ఈవోకు అప్పగించారు. అప్పటికే దేవస్థానం మైక్‌లో బాలుడి గురించి అనౌన్స్‌మెంట్ చేసింది. విషయం తెలుసుకున్న ఈవో మైక్ ప్రచార కేంద్రం వద్ద ఉన్న తల్లికి సమాచారం ఇచ్చి కుమారుడిని అప్పగించారు. ఏఎస్ఐ ఆర్వీ సత్యనారాయణను ఈవో, చైర్మన్ అభినందించారు.

సుబ్బారాయుడి ఆదాయం రూ.8.20 లక్షలు

మోపిదేవి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ప్రత్యేకత కావటంతో పలు ప్రాంతాల భక్తులు స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం స్వామివారికి ఎంతో విశేషమైన రోజు కావటంతో అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు నిర్వహించుకున్న సేవా రుసుముల ద్వారా ఒక్క రోజులోనే రూ.8,20,626 ఆదాయం లభ్యమైనట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు మెరుగులు

- కేంద్ర విద్యాశాఖ ప్రోత్సాహంతో నీతిఅయోగ్ అటల్ ఇన్నోవేషన్ కార్యక్రమం
- డీఈఓ యూవీ సుబ్బారావు

విజయవాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత నైపుణ్యాలతో సమాజంలోని రకరకాల సమస్యలకు పరిష్కారాలు చూపడానికి కేంద్ర విద్యాశాఖ నీతి అయోగ్ అటల్ ఇన్నోవేషన్ నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి యూవీ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పాఠశాల నుంచి ఎన్ని బృందాలైనా పాల్గొనవచ్చని, ఒక్కొక్క బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండాలన్నారు. విద్యార్థులకు సూచించిన కొన్ని అంశాల్లో ఒక దానిని ఎంచుకుని రెండు నుంచి ఐదు నిమిషాల వీడియో రూపొందించి vbb.mic.gon.inలో నమోదు చేసుకోవాలన్నారు. 2026 జనవరిలో నిపుణుల కమిటీ విజేతలను ప్రకటించి 10 జాతీయ, 100రాష్ట్ర, 1000 జిల్లా స్థాయి బృందాలను ఎంపిక చేసి కోటి రూపాయల నగదును అందజేస్తారని డీఈవో తెలిపారు.

విద్యార్థులకు కేటాయించిన అంశాలు

- ఆత్మ నిర్భర్ స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు, పరిష్కారాలు
- స్వదేశీ ఆలోచనలు జ్ఞాన వ్యవస్థలు, ఆవిష్కరణలు
- స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం
- దేశ స్థిరమైన అభివృద్ధికి మార్గాలను సృష్టించడం

వీటిలో ఏదైనా ఒక అంశాన్ని ఎంచుకుని పైన చెప్పిన వెబ్‌సైట్‌లో అక్టోబరు 13నుంచి 31లోగా అప్‌లోడ్ చేయాలని డీఈవో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'క్వాంటం ఏజ్ బిగైన్స్' సెమినార్ రేపు

విజయవాడ : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశాల మేరకు నగరంలోని బిషప్ అజరయ్య గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు 'క్వాంటం ఏజ్ బిగైన్స్ పొటెన్షియల్ అండ్ చాలెంజెస్' అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్టు డీఈవో సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న మండల స్థాయి విద్యార్థులు అర్హులని తెలిపారు. సెమినార్‌లో ఇవ్వబోయే అంశాలపై రాత పరీక్ష, ప్రజెంటేషన్‌తో పాటు క్విజ్ పోటీల ద్వారా విద్యార్థులను పరీక్షించి న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారన్నారు. విద్యార్థులు 5 చార్ట్స్/స్లైడ్స్ ఉపయోగించి గరిష్ఠంగా 6 నిమిషాల పాటు ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అనుమతి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని డీఈవో వెల్లడించారు. వీరు ఈ నెల 15న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. రాష్ట్రస్థాయి విజేతలకు ఈనెల 30న జాతీయస్థాయి సైన్స్ సెమినార్ బెంగుళూరులో జరుగుతుందని తెలిపారు.



మంగినపూడి బీచ్‌లో యువకులను రక్షించిన మెరైన్ పోలీసులు

మంగినపూడి బీచ్‌లో తప్పిన ప్రమాదం

- విహారానికి వచ్చి సముద్రంలో చిక్కుకున్న యువకులు
- వెంటనే స్పందించి రక్షించిన మెరైన్ పోలీసులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌లో ఆదివారం విహారయాత్రకు వచ్చిన యువకులు సముద్రం కెరటాల్లో చిక్కుకున్నారు. అలల తాకిడికి కొట్టుకుపోతుండగా మెరైన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ బోసు సిబ్బందితో హుటాహుటిన ప్రాణాలకు తెగించి యువకులను ఒడ్డుకు తెచ్చారు. కపిలేశ్వరపురానికి చెందిన అబ్దుల్ హసీఫ్, ఎండీ అన్వర్, ఎస్‌కె అర్షాద్, ఎస్‌కె సికిందర్ షరీఫ్‌లు ఆదివారం మంగినపూడి బీచ్‌కు విహారానికి వచ్చారు. సముద్రంలోకి వెళ్లి అలల తాకిడికి లోతుకు వెళ్లిపోగా మెరైన్ పోలీసుల తక్షణం స్పందించి వారిని రక్షించి ఒడ్డుకు తెచ్చారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులతో బీచ్ కిటకిటలాడింది.

బెజవాడలో అమరావతి షాపింగ్ ఫెస్టివల్

- నేటి నుంచి వారం రోజుల పాటు
- నిర్వహణ : కలెక్టర్ లక్ష్మీశ



అమరావతి షాపింగ్ ఫెస్టివల్ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌తో వినియోగదారులకు, వ్యాపారులకు సూపర్ ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతి కుటుంబానికి, వ్యాపారానికి మేలు జరుగుతుందని, జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే క్రమంలో ఈనెల 13 నుంచి 19 వరకు గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ, జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని పున్నమి ఘాట్-బెరం పార్కులో జరిగే గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌పై కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా, వాణిజ్య పన్నులశాఖ అధికారులతో కలిసి ఆదివారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాణిజ్యం, వినోదానికి వేదికగా నిలిచే షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హస్తకళాకారులు, ఇలా వివిధ వర్గాల వారు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకొని బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు. దీపావళి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తాయన్నారు. దాదాపు 100 స్టాళ్లతో ఏర్పాటుచేసే ఫెస్ట్‌లో మెగా లక్కీ డ్రాలతో పాటు ఉత్తమ స్టాళ్లకు అవార్డులు అందించనున్నట్టు వెల్లడించారు. వివరాల కోసం కలెక్టరేట్‌లోని 91549 70454 కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ జహీర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రజ్ఞా రాధిక, జిల్లా పరిశ్రమల అధికారి పి.మధు పాల్గొన్నారు.

మోటారు వాహనాల షోరూమ్‌ల యజమానులతో సమావేశం

గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో వివిధ మోటారు వాహనాల షోరూంల యజమానులు, ప్రతినిధులతో సమావేశ నిర్వహించారు. ఫెస్టివల్‌లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అలీ, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు. అనంతరం ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించారు.



గాంధీ క్షేత్రంలో 275 మంది ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కొత్త టీచర్లకు సత్కారం

- విద్యార్థులను తీర్చిదిద్దటమే
- లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి : బుద్ధప్రసాద్

అవనిగడ్డ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను తీర్చిదిద్ది దేశానికి మెరుగైన పౌరులను అందించటమే లక్ష్యంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు పనిచేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో విజయం సాధించిన 275 మంది ఉపాధ్యాయులను బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజాన్ని తీర్చిదిద్దే మహోన్నత వృత్తిలో అడుగు పెడుతున్న ఉపాధ్యాయులు తమకు అంది వచ్చిన అవకాశాన్ని దేశాభివృద్ధికి పాటుపడే వారిని తయారు చేసేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రతీ ఏటా డీఎస్సీ ప్రకటించటం ద్వారా కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పన కోసం ఏ స్థాయిలో కృషి చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, ప్రగతి కోచింగ్ సెంటర్ చైర్మన్ పూర్ణచంద్రరావు, విద్యానికేతన్ కోచింగ్ సెంటర్ చైర్మన్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, జీఎన్‌బీ.గోపాల్, టి.వి.ఎంరామదాసు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకారావు, డిపిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు జి.వి.ఎస్.పెరుమాళ్లు, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, ఉపాధ్యాయ సంఘ నేతలు పి.వి.ఎస్.వర్మ, విష్ణుప్రసాద్, చంద్రశేఖర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

గ్యార్మీ వేడుకల్లో మంత్రి రవీంద్ర

- గౌసియా మసీదు అభివృద్ధికి హసీంబేగ్ రూ.5 లక్షల విరాళం



డాక్టర్ హసీంబేగ్ ఇచ్చిన రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఇంగ్లీషుపాలెంలో గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో మంత్రి రవీంద్ర పాల్గొన్నారు. నూతనంగా నిర్మిస్తున్న గౌసియా మసీదు అభివృద్ధికి మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్ రూ.5 లక్షల విరాళం ఇవ్వగా మంత్రి కొల్లు రవీంద్ర మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మైనార్టీ విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లేందుకు కూడా అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల బుల్లయ్య, డీఎంసి చైర్మన్ బండి రామకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, పలు డివిజన్ల మైనార్టీ ఇన్‌చార్జులు స్టార్ బాషా, మసీదు కమిటీ సభ్యులు ఫైజానే గౌసే హసన్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

దివిసీమలో స్టాక్ ది రూమ్ సేవలు

- 2500 మంది బాలికలకు ఆర్గానిక్ ప్యాడ్స్ పంపిణీ



చల్లపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పుట్టిపెరిగిన చల్లపల్లిలో థాట్‌వేవ్ సాఫ్ట్‌వేర్ అండ్ సొల్యూషన్స్ కంపెనీని ప్రారంభించి అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న తాము సేవా కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నట్లు స్టాక్ ది రూమ్ ఫౌండర్, ఎన్నారై హంసిక తూము తెలిపారు. చల్లపల్లిలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బాలికల ఆరోగ్య సంరక్షణ, బాలికలకు గౌరవం, సమాన అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో అమెరికాలో మాత్రమే చేస్తున్న స్టాక్ ది రూమ్ సేవలను దివిసీమ ప్రాంతంలో అందిస్తామన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి దివిసీమ ప్రాంతంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఇంటర్, డిగ్రీ చదివే 2500 మంది విద్యార్థినిలకు సుమారు రూ.10 లక్షల విలువ చేసే అత్యాధునికమైన ఆర్గానిక్ ప్యాడ్స్‌ను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మెన్‌స్ట్రువల్‌పై బాలికల్లో అపోహలను తొలగించేందుకు సదస్సులను నిర్వహిస్తామన్నారు. సీఈవో రమేష్‌బాబు తూము, డైరెక్టర్ కుంబా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి కేంద్రంగా.. ఇక సీఆర్‌డీఏ పాలన

(5వ పేజీ తరువాయి)

వరకు విజయవాడలో ప్రధాన కార్యాలయం ఉండటం వల్ల రాజధాని రైతుల సమస్యలకు సంబంధించి తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతి సోమవారం అడిషనల్ కమిషనర్ స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తూ ఉండేవారు. రాజధాని రైతుల సమస్యలన్నీ ఎక్కువగా ఉన్నతస్థాయి అధికారులతో ముడిపడి ఉండటం వల్ల స్థానికంగా సీఆర్‌డీఏ కార్యాలయం ఉన్నా విజయవాడ రావాల్సి వచ్చేది. తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయం ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన స్థానిక వ్యవహారాలకు కేంద్రంగా పనిచేస్తుంది. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం రాజధాని తరలిపోతున్న తరుణంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్లానింగ్, ఇంజనీరింగ్, తదితర అన్ని విభాగాలు కూడా ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన వారంతా ఇక్కడే పనిచేస్తారు. విజయవాడ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ పనిచేసే అవకాశం ఉంది.

శాఖల వారీగా కేటాయింపులు ఇలా..

గ్రౌండ్ ఫ్లోర్ 23,184 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. ఇందులో పబ్లిక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, రెస్టారెంట్, బ్యాంక్, ఏఐ కమాండ్ సెంటర్‌లు ఉంటాయి. ఫస్ట్ ఫ్లోర్ 30,886 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. ఈ ఫ్లోర్‌లో కాన్ఫరెన్స్ హాల్స్ ఉంటాయి. రెండవ ఫ్లోర్‌లో 30,886 చదరపు అడుగుల స్థలం ఉంది. ఈ ఫ్లోర్‌లో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ఉంటుంది. మూడవ ఫ్లోర్ విస్తీర్ణం 32,096 చదరపు అడుగులు ఉంది. ఈ ఫ్లోర్‌ను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) కార్యాలయానికి కేటాయించారు. నాల్గవ ఫ్లోర్‌లో 30,682 చదరపు అడుగుల స్థలం ఉంది. ఈ ఫ్లోర్‌లో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) ప్రధాన కార్యాలయానికి కేటాయించారు. ఐదవ ఫ్లోర్‌లో 32,096 చదరపు అడుగుల స్థలం ఉంది. దీనిని సీఆర్డీఏ (ఏడీసీఎల్)కు కేటాయించారు. ఆరవ ఫ్లోర్‌లో 32,096 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. ఈ ఫ్లోర్‌ను ఏడీసీఎల్‌కు కేటాయించారు. ఏడవ ఫ్లోర్‌ను మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి చాంబర్, ఏఎంయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ చాంబర్, పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీ, ఏడీసీఎల్ టెర్రస్, పీఈబీ డైనింగ్, హెడ్ రూమ్స్ వంటి వాటికి కేటాయిచారు.

పారిశ్రామిక ప్రగతి!

(5వ పేజీ తరువాయి)

చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ రైల్వేఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా భూసేకరణ కోసం ఇటీవల రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. ఈ భూసేకరణ పూర్తయితే ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేసేందుకు నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది. దీంతోపాటు మచిలీపట్నం-గిలకలదిండి రహదారిని నాలుగులేన్లుగా అభివృద్ధి చేసేందుకు ఇటీవల ప్రణాళికను రూపొందించారు. ఈ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలను పూడ్చేపనులు ప్రారంభించారు. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంతో పాటు నాలుగులేన్లుగా ఈ రహదారిని నిర్మాణం చేస్తే ఎంఎస్ఎంఈ పార్కులో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు మరింతగా ముందుకు వచ్చేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే గిలకలదిండి ప్రాంతంలో ఐస్‌ప్లాంట్‌లు, ఇతరత్రా మత్స్యఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతంలో చిన్నపాటి పారిశ్రామికవేత్తలు భూములను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే భూసేకరణ జరగడంతో, అక్కడ యూనిట్‌లు ఏర్పాటు చేస్తే రాయితీలు ప్రభుత్వం నుంచి వచ్చే అవకాశం ఉంది. దీంతో చిన్నతరహా పారిశ్రామికవేత్తల చూపు గిలకలదిండి వైపు పడింది.

ఏటీఎస్‌తో ఇక్కట్లు

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకుని 10వ తేదీన ఏజెంట్ ద్వారా ఫిట్‌నెస్‌కు వెళ్లగా బ్రేక్ టెస్ట్ పాస్ అయ్యింది. దీంతో వాహనదారుడు ఆశ్చర్యపోయాడు. బ్రేక్‌తో పాటు ఆల్గో అడ్వైజరీ పేరుతో అదనంగా రూ.144 తమ నుంచి వసూలు చేశారని సదరు వాహన యజమాని ఆరోపించారు. నేరుగా వెళితే అవ్వని బ్రేక్, ఏజెంట్ ద్వారా వెళితే అవ్వడం ఏటీఎస్ కేంద్రం పనితీరును స్పష్టం చేస్తుంది.

పాత విధానాన్నే కొనసాగించాలి

- అడుసుమిల్లి శ్రీనివాస్, ది గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

జిల్లా కేంద్రంలో ఏటీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో వాహన యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. వాహన యజమానులు రోజంతా ఏటీఎస్ కేంద్రంలో ఉండాల్సి వస్తోంది. దీంతో సమయంతో పాటు డబ్బు వృథా అవుతుంది. గతంలో ఉన్న విధంగా స్థానిక ఆర్టీవో కార్యాలయాల్లో వాహనాలు బ్రేక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

లిప్ సింక్ చేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

పాడుతున్నట్టుగా ఒక వీడియోను సృష్టిస్తుంది.

ఈ యాప్‌లతో ఇష్టానుసారంగా...

నకిలీ వీడియోలను తయారు చేయడానికి సైబర్ నేరగాళ్లు ఇప్పటి వరకు మార్ఫింగ్ టూల్స్‌ను ఉపయోగించారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలా సులువుగా వాస్తవికతకు దగ్గరగా ఉండేలా నకిలీ వీడియోలకు ప్రాణం పోస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ నేతల ఫొటోలతో ఈ వీడియోలు తయారు చేస్తున్నారు. ఇందుకోసం అనేక ఏఐ యాప్‌లు ఉపయోగిస్తున్నారు. వావ్2లిప్, హైజెన్, రీఫేస్, డబ్‌వెర్స్, డీ-ఐడీ, డీప్ ఫేస్ ల్యాబ్ వంటి యాప్‌లను ఉపయోగిస్తున్నారు.

కానిస్టేబుల్ దంపతుల ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే సురేంద్రబాబు కుటుంబ సభ్యుల ప్రమేయం లేదు
- దాడి చేసుకున్న ఇరువర్గాలపై కేసులు: అనంతపురం డీఎస్పీ

అనంతపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య తలెత్తిన ఘర్షణ నేపథ్యంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుళ్లు, అనుచరులు దాడి చేశారని ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్, ఆయన భార్య సుజాత చేసిన ఆరోపణలు అవాస్తవమని అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆదివారం అనంతపురం నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. అనంతపురంలోని ఎలైట్ అపార్ట్‌మెంట్ కింది ఫ్లోర్‌లో ఏఆర్ కానిస్టేబుల్ భువన్ చక్రవర్తి, ఫస్ట్ ఫ్లోర్‌లో మరో ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్ కుటుంబాలు ఉంటున్నాయి. కొంతకాలం ఈ రెండు కుటుంబాలు కలిసిమెలిసి బాగానే ఉన్నాయి. రెండు నెలల క్రితం హరినాథ్ పిల్లలు క్రికెట్ ఆడుతుండగా... బాల్ వెళ్లి భువన్ చక్రవర్తి కొత్తగా తెచ్చుకున్న కారుకు తగిలింది. దీంతో భువన్ చక్రవర్తి కుటుంబ సభ్యులు.. 'ఇక్కడ క్రికెట్ ఆడొద్దండి.. వాహనాలున్నాయి కదా.. డ్యామేజీ అవుతాయి' అని హరినాథ్ పిల్లలకు చెప్పారు. అయినా ఆ పిల్లలు పెడచెవిన పెట్టారు. వారిని హరినాథ్ వెనకేసుకొచ్చారు. దీంతో ఆ రెండు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఇదే క్రమంలో ఈ నెల 10వ తేదీన హరినాథ్ కుమారుడు, అతడి సంబంధీకుడు ప్రభాకర్ క్రికెట్ ఆడుతుండగా.. భువన్ చక్రవర్తి భార్య కళ్యాణి వచ్చి ఇక్కడ ఆడకూడదంటూ అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాల్లోని మహిళలు వాగ్వాదం చేసుకోవడంతో పాటు నెట్టుకున్నారు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను మందలించారు. ఆ తర్వాతి రోజు కూడా హరినాథ్ భార్య సుజాత, భువన్ చక్రవర్తి భార్య కళ్యాణి మరోసారి సిగపట్లు పట్టారు. కొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుళ్లు, వారి అనుచరుల ప్రమేయమే లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. హరినాథ్, సుజాత రాజకీయ నాయకుల పేర్లు చెప్పి వారిపై ఆరోపణలు సరికాదన్నారు.

జనార్దన్‌రావుపై పీటీ వారెంట్!

- కోర్టులో హాజరుపర్చనున్న ఎక్సైజ్ అధికారులు

విజయవాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావును పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ పోలీసులు చర్యలు చేపట్టారు. జనార్దన్‌రావును ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లాలోని కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అన్నమయ్య జిల్లాలో నమోదు చేసిన కేసులోనూ జనార్దన్‌రావు ఏ1 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో ఆయన్ను కోర్టులో హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్ సిద్ధం చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో దీనిని కోర్టులో దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

హనీట్రాప్‌తో 11 లక్షలు దోపిడీ

- ఇంకా కావాలంటూ బ్లాక్ మెయిల్
- బాధితుడి ఆత్మహత్యాయత్నం.. పోలీసులకు ఫిర్యాదు
- తెలంగాణ పోలీసుల అదుపులో నిందితుడు

మార్కాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన ఓ యువకుడు ఫేస్‌బుక్‌లో పరిచయమైన అమ్మాయితో కలిసి.. తెలంగాణకు చెందిన మరో విద్యార్థిని ట్రాప్ చేశాడు. ఆమెతో అతనికి 'న్యూడ్ కాల్స్' చేయించి.. ఆ వీడియోలు ఆన్‌లైన్‌లో పెడతానని బెదిరించి.. రూ.11 లక్షలు కాజేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. మార్కాపురానికి చెందిన సంజయ్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఆయనకు ఫేస్‌బుక్ ద్వారా విజయవాడకు చెందిన ఓ యువతి పరిచయమైంది. ఆమెతో కలిసి హనీట్రాప్ ద్వారా డబ్బులు సంపాదించాలని సంజయ్ యోచించాడు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా హత్నూరు మండలం కోనంపేటకు చెందిన ఓ విద్యార్థికి ఆ యువతితో వీడియో కాల్ చేయించేవాడు. ఆ కాల్స్‌ను రికార్డు చేసిన సంజయ్ వాటిని తెలంగాణ విద్యార్థి వాట్సాప్ నంబర్‌కు పంపాడు. తనకు డబ్బులివ్వకుంటే వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో పలు దఫాలుగా సంజయ్ చెప్పిన వివిధ బ్యాంకు ఖాతాలకు రూ.11 లక్షలు పంపాడు. అయినా ఇంకా డబ్బులు కావాలంటూ సంజయ్ వేధిస్తుండటంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు ఆదివారం మార్కాపురం వచ్చి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. డబ్బులు ఖాతాల్లో పడిన సంజయ్ స్నేహితులను సంగారెడ్డికి తీసుకెళ్లారు.

ప్రపంచస్థాయిలో తెలుగురాష్ట్రాలు : యనమల

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తన విజన్‌తో రెండు తెలుగు రాష్ట్రాలను ప్రపంచ స్థాయిలో నిలబెట్టారని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. చంద్రబాబు సీఎంగా 15 ఏళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి చంద్రబాబు అంకుఠిత దీక్షతో పనిచేస్తున్నారన్నారు.

జగన్ హయాంలోనే 'కల్తీ'కి పురుడు : పంచుమర్తి

కల్తీ మద్యం పురుడు పోసుకున్నది వైసీపీ హయాంలోనేనని మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. వైసీపీ పాపాల్ని తుడిచే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. నకిలీ మద్యంపై మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. గొడ్డలిపోటు నుంచి గులకరాయి వరకు మీ డ్రామాలు చూశామని, తప్పు చేసి నెపాన్ని తమపై నెట్టడం అలవాటేనని వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతరిస్తున్న జాతుల్లో భారతీయ తోడేలు

ముంబై, అక్టోబరు 12: ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన తోడేలు వంశాల్లో ఒకటైన భారతీయ తోడేలు(కానిస్ లూపస్ పల్లిప్స్) మనుగడ ప్రమాదంలో పడింది. ఈ జాతి తోడేళ్ల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతోంది. 2023-24 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా ఈ తోడేళ్లు.. 2,877 నుంచి 3,310 వరకు మాత్రమే ఉన్నట్టు భారతీయ పరిశోధకులు అంచనా వేశారు. దీంతో వీటిని అంతరించిపోతున్న జాతులుగా గుర్తించిన అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సమితి(ఐయూసీఎన్)... వీటిని ఈ నెల 10న తొలిసారిగా ప్రమాదంలో ఉన్న జాతుల జాబితాలో చేర్చింది. 1995లో చివరిసారిగా మొరాకోలో కనిపించిన స్లెండర్-బిల్డ్ కర్లీ అనే వలస పక్షి జాతి పూర్తిగా అంతరించిపోయినట్టు ఐయూసీఎన్ ప్రకటించింది.

ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలు నిషేధించాలి

- కర్ణాటక సీఎంకు మంత్రి ప్రియాంక్ ఖర్గే లేఖ

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ సీఎం సిద్దరామయ్యకు మంత్రి, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, పబ్లిక్ మైదానాల్లో ఆరెస్సెస్ తన 'శాఖ'లను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. నినాదాలు చేస్తూ పిల్లలు, యువత మనసుల్లో ప్రతికూల ఆలోచనలను నాటుతోందని ఆరోపించారు. ఆరెస్సెస్ నమ్ముతున్న వ్యవస్థ భారత దేశ ఐక్యత, లౌకిక భావనకు విరుద్ధమని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జోక్యం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో యూపీఐతో ఫీజుల వసూలు

న్యూఢిల్లీ, అక్టోబరు 12: పాఠశాలల్లో విద్యార్థుల నుంచి తీసుకునే ఫీజుల వసూలుకు యూపీఐ(యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు పాఠశాలల్లో యూపీఐ చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్‌ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) తదితర బోర్డులకు కేంద్ర విద్యా శాఖ లేఖలు పంపింది. ఇకపై, ఫీజులను యూపీఐ ద్వారా వసూలు చేసుకోవాలని ఆ లేఖల్లో స్పష్టం చేసింది. నగదు రహిత విధానం వల్ల పాఠశాలల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం పేర్కొంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

సూపర్ జీఎస్టీతో ప్రతి కుటుంబానికీ మేలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణల ద్వారా ప్రజలకు ఆర్థికభారం తగ్గి ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, ఏఎంసీ డైరెక్టర్ మున్నంగి శేషగిరిరావు తెలిపారు. రామన్నగూడెంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రైతులకు అండగా నిలచేలా వారు ఉపయోగించే ట్రాక్టర్ల విడిభాగాల పరిక రాలు, బిందు సేద్య పరికరాలపై కేంద్ర ప్రభుత్వం తగ్గించిన రేట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తగ్గించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు ముదరబోయిన దాసు, ఉపాధ్యక్షుడు జవ్వనపూడి ఏసుపాదం, వడ్లమూడి నాని, జూపూడి బాలకృష్ణమూర్తి, జాస్తి భూపతిరావు, కాలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీలో రెవరెండ్ ఫాదర్ పసల థామస్

పేదలను ఆదుకోవాలి

గన్నవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలను, వృద్ధులను ఆదుకోవటం మానవ ధర్మమని ఆర్సీఎం చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ పసల థామస్ అన్నారు. స్థానిక ఆర్సీఎం చర్చి ఆవరణలో ఇన్ఫంట్ జీసెస్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమకు ఉన్న దానిలో ఇతరులకు సహాయం చేయాలన్నారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని చెప్పారు. పసల రత్నం, రాబర్ట్ జాన్సన్, వీఏ విజయకుమార్, కిషోర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముఠా కార్మికుడు మృతి

గన్నవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జాతీయ రహదారి కొత్తపేట పాత చైతన్య పాఠశాల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలోముఠా కార్మికుడు దుర్మరణం చెందాడు. మండలంలోని ముదిరాజుపాలెంకు చెందిన గోనేపల్లి రాధాకృష్ణ(47) గన్నవరంలో బజారు ముఠా కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా కొత్తపేట వద్ద రోడ్డు దాటుతున్న రాధాకృష్ణను విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తలభాగం నుజ్జు నుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధర్మప్రచారంలో పాండురంగారావు, దావులూరి శ్రీహరి

యువతకు మార్గదర్శి భగవద్గీత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): యువతకు మార్గదర్శి భగవద్గీత అని రామసేతు కార్యకర్త ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు అన్నారు. కె.సీతారాంపురంలోని శ్రీకోదండ రామాలయంలో ఆదివారం ధర్మప్రచారం, భగవద్గీత ప్రవచనం నిర్వహించారు. ధర్మ పరిరక్షణలో భగవద్గీతకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ గీతాబోధన అవసరమన్నారు. డిసెంబరులో జరిగే శివశక్తి 10వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారక్ దావులూరి శ్రీహరి, శివశక్తి సభ్యులు వెంకటేశ్వరరావు, చెన్నుబోయిన వాసు, ఆవల వెంకటేశ్వరమ్మ, మాయర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వీరవల్లి ఎస్సై శ్రీనివాస్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లకు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటు నమోదైన వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, నేరాలను ప్రోత్సహించినా, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా సహించేది లేదన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అసోసియేట్

ప్రెసిడెంట్‌గా ప్రకాష్‌నాథ్

పెనమలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శుల జిల్లా నూతన కమిటీ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గంగూరు కార్యదర్శి వీఎస్ ప్రకాష్‌నాథ్ ఎంపికయ్యారు. బందరులోని ఎన్జీవో హోంలో శనివారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా కే నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా కే రామ్మోహన్ రావు, కోశాధికారిగా రాధాకృష్ణలతో కూడిన 22సభ్యులతో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

సీఐ కోసం ఎదురుచూపు!

- పరిధిలో అతిపెద్ద హైవే కారిడార్, మల్లవల్లి పారిశ్రామికవాడ.
- నియోజకవర్గంలో పెద్దదైన గన్నవరం, హనుమాన్‌జంక్షన్‌కు ఒక్కరే సీఐ



హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్)

జిల్లాలోనే అతి పెద్ద జాతీయ రహదారి కారిడార్ కలిగి.. రాష్ట్రానికే తలమానికమైన మల్లవల్లి పారిశ్రామికవాడ ఉన్న హనుమాన్‌జంక్షన్ లా అండ్ ఆర్డర్ సర్కిల్ గత కొద్ది నెలలుగా సీఐ పోస్టు కోసం (సర్కిల్ ఇన్‌స్పెక్టర్) కోసం ఎదురుచూస్తోంది. గతంలో పనిచేసిన సీఐ బదిలీపై వెళ్లిన నేపథ్యంలో గన్నవరం సీఐని ఇంచార్జిగా నియమించారు. హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పరిధిలో వీరవల్లి, హనుమాన్ జంక్షన్, ఆత్కూరు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో రాత్రి గస్తీలు, శాంతి భద్రత పరిరక్షణ వంటివి కొంత కష్టతరంగా మారాయి. నియోజకవర్గంలో పెద్దదైన రెండు సర్కిళ్లకు (హనుమాన్‌జంక్షన్‌కు, గన్నవరం) సీఐ ఒక్కరే నెలల తరబడి విధుల నిర్వహించడం వల్ల కొన్ని సార్లు ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. గత సీఐ బదిలీ వెళ్లి నెలలు గడుస్తున్నా ఎవరి కోసం హనుమాన్‌జంక్షన్ సర్కిల్ ఖాళీగా ఉంచారనేది ప్రజల్లో ఉత్పన్నమవుతున్న ప్రశ్న. గన్నవరం పరిధిలో విమానాశ్రయానికి వీఐపీల తాకిడి ఉండటం, ఇటు జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీ, అటు పెద్ద పారిశ్రామికవాడ ఇన్నింటినీ ఒకే సీఐ (వ్యక్తి) పర్యవేక్షించడం ఎంత వరకూ సబబనేది పోలీసు ఉన్నతాధికారులు ఆలోచించాల్సిన విషయం.



మూసి ఉన్న సర్కిల్ కార్యాలయం తలుపులు

సుమారు 25 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారి విస్తరించి ఉండటంతో పాటు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జాతీయ రహదారిపై ప్రమాదాలు, హిట్ అండ్ రన్ లాంటివి జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ప్రమాద కూడళ్లపై(బ్లాక్‌స్పాట్)ప్రత్యేక కార్యాచరణ ప్రకటించారు. మల్లవల్లి పారిశ్రామిక వాడకు నిత్యం పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు అభివృద్ధి ప్రణాళికల కోసం వచ్చి వెలుతుంటారు. ఇదే సమయంలో విమానాశ్రయానికి వచ్చే వీఐపీల తాకిడి తెలిసిందే. అయినా గన్నవరం, హనుమాన్‌జంక్షన్ సర్కిళ్లకు ఒకే అధికారితో విధులు నిర్వహించడం పోలీసుశాఖకే చెల్లింది.

శాంతిభద్రత విభాగంలో అత్యున్నత స్థాయి అధికారి బదిలీపై వెళ్లి నెలలు గడుస్తున్నా ఇంత వరకూ ఎవరినీ నియమించకపోగా ఇంచార్జితో కాలం గడపడం పట్ల ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. ఎందుకోసం సీఐ స్థానాన్ని ఖాళీగా ఉంచారనేది ఉన్నతాధికారులకే తెలియాలి. హనుమాన్ జంక్షన్ సర్కిల్ (పోలీసు) అవసరాన్ని ఉన్నతాధికారులు ఇప్పటికైనా గుర్తించి త్వరితగతిన సీఐని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటి పరిధిలోని పోరంకి అలివేలు మంగ గార్డెన్స్‌లో రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసిన రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోనే సుమారు రూ. 100 కోట్ల పైబడి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రూ. 60 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు : నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు సర్వీసు రోడ్డులో సైడు కాలువ నిండి వర్షపు, మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తున్న తీరును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షం పడిన సమయాల్లో జాతీ య రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతుందన్నారు. వర్షపు నీరు, మురుగు నీరు రోడ్డుపైకి చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్, వంగూరు పవన్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన గేటును ప్రారంభిస్తున్న హెచ్ఎం విజయ్

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి

- రూ.లక్షతో గేటు ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న కృషి అభినందనీయమని హెచ్ఎం కొమ్మా విజయ్, వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరు హైస్కూల్‌కు చెందిన 1990-91 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుంటూ అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అక్కినేని రాఘవేంద్రరావు, విశ్రాంత హెచ్ఎం విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి రూ.లక్షతో ఏర్పాటు చేసిన పాఠశాల ముఖద్వారం వద్ద గేటు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ మాలావతుల లక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, విజయలక్ష్మి, రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి (పూర్వ విద్యార్థి) వేములపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అవిర్నేని భవానీశంకర్, రాజేశ్వరి, కృష్ణప్రసాద్ తదితర ఉపాధ్యాయులు, కొండలరావు, సురేష్, మత్తి రాంబాబు, శ్రీనివాసరావు, బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు

ఉయ్యూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణప్రాంత ప్రజలకు తెలుగు యువత నాయకుడు మోటూరు నాగేంద్రం ఆధ్వర్యంలో కార్పొరేట్ వైద్య సేవలందించటం అభినందనీయమని ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యానారాయణ (నాని) అన్నారు. ఉయ్యూరు ఒకటవ వార్డు నాగన్నగూడెం ఎస్సీ కాలనీలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించటం తెలుగుయువత నాయకులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, టీడీపీ నాయకులు పి. సురేష్, మోటూరు రంగారావు, పాలగుడు చంద్రశేఖర్, పవన్ కుమార్, గుంజా సాయి కిరణ్, పండు, లక్ష్మణరావు, పొనుగుమాటి నవజీవన్, తలారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిత్యాన్నదాన పథకానికి కూరగాయల వితరణ

భారతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి శ్రీరామచంద్రనగర్ కాలనీ నుంచి ఆదివారం దాతలు వడ్లపట్ల నాగేశ్వరరావు, సామ్రాజ్యం దంపతులు, కుటుంబ సభ్యులు అట్లూరి వెంకట రవీంద్ర, హరిత దంపతులు, తూమాటి సత్యచంద్రశేఖర్, జ్యోతి దంపతుల సహకారంతో 11టన్నుల కూరగాయలను పంపించారు. కూరగాయల లారీని దాతలు అట్లూరి వెంకట రవీంద్ర, హరిత దంపతులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



శ్రీరామచంద్రనగర్ కాలనీ నుంచి కూరగాయల లారీని పంపుతున్న దాతలు





కానూరు ఎస్‌బీఐ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం వద్ద చెత్తాచెదారం.. రోడ్డు పక్కన

అంగన్వాడీ చెంతనే చెత్తాచెదారం!

- కానూరు మెయిన్‌రోడ్డులో సైతం చెత్తకుప్పలు.. కుక్కల స్వైరవిహారం..
- ఇబ్బందిపడుతున్న స్థానికులు.. పట్టించుకోని అధికారులు..

కానూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపాలిటీలోని అతిపెద్ద గ్రామమైన కానూరులో రోడ్ల వెంట చెత్తకుప్పలు దర్శనమిస్తోన్నాయి. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్ చెంతనే చెత్తకుప్పలతోపాటు అస్తవ్యస్తమైన ఓపెన్ డ్రెయినేజీ కూడా ఉంది. ఈచెత్త నుంచి వచ్చే దుమ్ము ధూళితోపాటు డ్రెయినేజీ నుంచి వచ్చే దుర్వాసన వల్ల పాఠశాలలోని చిన్నారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. అక్కడే ఈగలు, దోమలు వృద్ధిచెందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే అదే రోడ్డులో చెత్తచెదారం కూడా కుప్పలుగా ఉంది. స్థానిక మెయిన్ రోడ్డులో ఏర్పాటుచేసిన పబ్లిక్ డస్ట్‌బిన్ కూడా చెత్తతో నిండిపోయింది. డస్ట్‌బిన్ కింద పడిన చెత్తపై కుక్కలు స్వైర్య విహారం చేస్తూ స్థానికులను ఇబ్బంది పెడుతున్నాయి. తాడిగడప మున్సిపాలిటీకి స్వచ్ఛ అవార్డు వచ్చిందే తప్ప పారిశుధ్యం మాత్రం మెరుగుపడలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎల్‌ఓసీ పత్రాలను రోగి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


ప్రజారోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

ప్రసాదంపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రోగులకు వైద్యచికిత్స కోసం రూ.13 లక్షల విలువైన ఎల్‌ఓసీలను రోగి కుటుంబ సభ్యులకు విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడుకు చెందిన వల్లభనేని ప్రసాదరావుకు రూ.1.50 లక్షలు, అంబాపురం గ్రామానికి చెందిన బకరు శ్రీమహాలక్ష్మీకి రూ.2 లక్షలు, ఉంగుటూరు గ్రామానికి చెందిన కలపాల ప్రకాశంకు రూ.1.50 లక్షలు, పొట్టిపాడు గ్రామానికి చెందిన తాడంకి జమీమా పసిబిడ్డ వైద్య చికిత్సకు రూ. 3 లక్షలు, బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామానికి చెందిన మట్టా నాగలక్ష్మీ పసిపాపకు రూ.1.25 లక్షలు, కోడూరుపాడుకు చెందిన షేక్ రిజ్వానా కుమార్తె వైద్య సహాయానికి రూ.3 లక్షలు, వేలేరు గ్రామానికి చెందిన సరిపల్లి సునీత వైద్య ఖర్చులకు రూ.75 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.13 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాలను కుటుంబ సభ్యులకు అందించారు.

ఘనంగా స.హ చట్టం ఆవిర్భావ దినోత్సవం

గన్నవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిందని ఇండియన్ యాక్ట్ అవేర్‌నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక విశ్వభారతి సైనిక్ స్కూల్ నవోదయ కోచింగ్ బిల్డింగ్ ఆవరణలోని కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐఏఏవీఓ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ, సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవలు పొందడానికి చట్టం ఎంతో దోహదపడుతుందన్నారు. పాలనలో పారదర్శకత పొందిన అంశమై ఎందరో చట్టాన్ని వినియోగించి ఎన్నో విజయాలు సాధించాలని వివరించారు. యూఎఫ్ఐఆర్‌టీఐ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాస్ గౌడ్, బేతపూడి జోగేశ్వ రరావు, డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ, హేమలత, రాజు, నాగరాజు శ్రీనివాసరావు, యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026



ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026 కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే, టెలికాం, డిఫెన్స్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఇంజనీరింగ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఇంజనీరింగ్ సర్వీసులో సివిల్స్ లాంటి పోస్టులు ఇవి.

ఖాళీలు 474

UPSC

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్

విద్యార్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ తదితర అర్హతలు ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: స్టేజ్ - 1 ప్రిలిమినరీ పరీక్ష, స్టేజ్-2లో మెయిన్ పరీక్ష ఉంటుంది. స్టేజ్-3లో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది. తరువాత మెడికల్ ఎగ్జామినేషన్ కూడా ఉంటుంది.

ప్రిలిమినరీ పరీక్ష: రెండు ఆబ్జెక్టివ్ టైప్(మల్టిపుల్ చాయిస్) తరహా ప్రశ్న పత్రాలు ఉంటాయి. ఇవి 500 మార్కులకు ఉంటాయి. ఇందులో 200 మార్కులకు పేపర్-1 ఉంటుంది. దీనిని రెండు గంటల్లో పూర్తి చేయాలి. 300 మార్కులకు పేపర్-2 ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ఇందులో కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్టులపై ప్రశ్నలు ఉంటాయి. అలాగే నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

మెయిన్స్ పరీక్ష: ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ పరీక్ష. ప్రిలిమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారిలో 1:6 లేదా 1:7 మందిని మెయిన్స్‌కు పిలుస్తారు. అంటే యావరేజీగా 2844 నుంచి 3318 మందికి మెయిన్స్ రాసే అవకాశం లభించవచ్చు. ఇందులో కూడా రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరుకు 300 మార్కులు. ఇవి పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పేపర్లు. ఒక్కో పేపర్ వ్యవధి మూడు గంటలు.

ఇంటర్వ్యూ: చివరగా ఇంటర్వ్యూ ఉంటుంది. దీనికి 200 మార్కులు కేటాయించారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనిలో అభ్యర్థుల ఆలోచించే తీరు, తెలివి తేటలు, నాయకత్వ లక్షణాలను పరిశీలిస్తారు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 16

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 8

మెయిన్స్ పరీక్ష: 2025 జూన్ 21

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

దిక్సూచి

నవోదయ విద్యాలయాల దరఖాస్తు గడువు అక్టోబర్ 21

జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో 9వ, 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి(లేటర్ ఎంట్రీ)కి దరఖాస్తుల గడువు 2025 అక్టోబర్ 21. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఆధునిక విద్యను అందించడం జేఎన్‌వీల ముఖ్య ఉద్దేశం.

- దేశ వ్యాప్తంగా 653 జేఎన్‌వీలు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు 9 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తారు. విద్యార్థి తను దరఖాస్తు చేయాలనుకున్న జిల్లా స్థానిక అభ్యర్థి అయి ఉండాలి. ఆయా జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతూ ఉండాలి.

పరీక్ష: మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. రెండున్నర గంటల్లో సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది.

పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 7

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1/


ఇండియన్ రైల్వేల్లో ఉద్యోగాలు

నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్)

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు 8050 ఉద్యోగాలతో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్) సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 5000 పోస్టులు గ్రాడ్యుయేట్, 3050 పోస్టులు అండర్ గ్రాడ్యుయేట్ ఉన్నాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 21 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 28 నుంచి ప్రారంభం అవుతాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 20, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 27.

- గ్రాడ్యుయేట్ స్థాయి పోస్టులలో గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్ వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్ ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, రైళ్ల క్లర్క్ ఖాళీలు ఉన్నాయి.

వయస్సు: గ్రాడ్యుయేట్ పోస్టులకు 18 నుంచి 33, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు 16-33 ఏళ్ల లోపు ఉండాలి. జోన్లు, విభాగాల వారీగా ఖాళీలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది.



జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్

భారతీయ రైల్వే 2570 పోస్టులతో మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే డివిజన్లలో ఉన్న కింద పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులను కోరుతోంది.

పోస్టులు: జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్.

(పూర్తి వివరాలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది. దీని కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌ను తరచూ చెక్ చేసుకుంటూ ఉండాలి.)

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2026 జనవరి 1 నాటికి 18-33 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తులు ప్రారంభం: 2025 అక్టోబర్ 30

చివరి తేదీ: 2025 నవంబర్ 30

రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబాయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం,

వెబ్‌సైట్: https://rrbsecunderabad.gov.in/



ఢిల్లీ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 509

ఢిల్లీ పోలీస్ విభాగంలో 509 హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఆసక్తిగల స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు:

- హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) మేల్: **341**
- హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) ఫీమేల్: **168**

వయస్సు: 2025 జూలై1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్

చివరి తేదీ: 2025 అక్టోబర్ 20

పరీక్ష తేదీ: 2025 డిసెంబర్/ 2026 జనవరి

వెబ్‌సైట్: https://ssc.gov.in

జర్నలిజం కోర్సులో అడ్మిషన్లు

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో 2025-26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అందించే ఈ కోర్సులు అభ్యర్థులు తమ ఆసక్తిని బట్టి రెగ్యులర్, కరస్పాండెన్స్ పద్ధతిలో చదవవచ్చు.

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్
- **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. కనీసం విద్యార్హత పదో తరగతి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 18

ఫోన్: 98485 12767, 7286013388


వెబ్‌సైట్: www.apcj.in

AP COLLEGE OF JOURNALISM

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అఖండ 2కు మరో ఆకర్షణ





బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అఖండ' చిత్రానికి బాలకృష్ణ నటనతో పాటు తమన్ నేపథ్య సంగీతం సైతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకొంది. ఇప్పుడు మరోసారి 'అఖండ 2' కోసం తమన్ రంగంలోకి దిగారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం బ్యాగ్రౌండ్ స్కోర్‌ను ప్రారంభించారు. సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యంతో ప్రసిద్ధి చెందిన పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులు ఇద్దరూ నేపథ్య సంగీతం కోసం తమ అద్భుతమైన గాత్రంతో సంస్కృత శ్లోకాలను, వేద మంత్రాలను పఠించనున్నారని తమన్ తెలిపారు. వారితో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఈ చిత్రంలో సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి విలన్ పాత్ర పోషిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలకపాత్రలో కనిపించనున్నారు.

సెన్సార్ పూర్తి



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా' సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సిద్ధు సరసన శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మోగ్లీ రాక ఖరారు



రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్ రాజ్ తెరకెక్కిస్తోన్న 'మోగ్లీ 2025' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తోన్న ఈ చిత్రం డిసెంబరు 12న విడుదల కానుంది. ఇప్పటికే నాని వాయిస్ ఓవర్‌తో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. రోషన్ సరసన సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటిస్తున్నారు. బండి సరోజ్ కుమార్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు.

అట్టహాసంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. 'లాపతా లేడీస్' ఉత్తమ చిత్రంగా పురస్కారం అందుకుంది. అత్యధికంగా 13 అవార్డులు దక్కించుకుని సత్తా చాటింది. ఆ సినిమాను తెరకెక్కించిన కిరణ్‌రావు ఉత్తమ దర్శకురాలుగా అవార్డును స్వీకరించారు. 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తిక్ ఆర్యన్, 'ఐ వాంట్ టూ టాక్' చిత్రానికి గాను అభిషేక్ బచ్చన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. 'జిగ్రా' సినిమాకు గాను ఉత్తమ నటిగా ఆలియా భట్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమానికి షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. 17 ఏళ్ల తర్వాత షారుక్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం విశేషం. కాజోల్‌తో కలసి స్టెప్పులేసి అందర్నీ ఆకట్టుకున్నారు. తన ప్రదర్శనతో జీనత్ అమన్‌కు నివాళినిచ్చారు కృతిసనన్.





షారుక్ ఖాన్, కాజోల్



నితాన్షీ గోయెల్



ప్రతిభ



ఆలియ భట్

అవార్డులు అందుకున్న మరికొందరి వివరాలు

- **ఉత్తమ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్):** రాజ్‌కుమార్ రావు (శ్రీకాంత్)
- **ఉత్తమ నటి (క్రిటిక్స్ ఛాయిస్):** ప్రతిభ (లాపతా లేడీస్)
- **ఉత్తమ సహాయ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్):** రవి కిషన్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ సహాయ నటి (క్రిటిక్స్ ఛాయిస్):** ఛాయా కదమ్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ చిత్రం:** ఐ వాంట్ టూ టాక్ (సూజిత్ సర్కార్)
- **ఉత్తమ పరిచయ నటుడు:** లక్ష్య (కిల్)
- **ఉత్తమ పరిచయ నటి:** నితాన్షీ గోయెల్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ స్క్రీన్‌ప్లే:** నేహా దేశాయ్ (లాపతా లేడీస్)
- **ఉత్తమ కథ:** ఆదిత్య ధర్, మోనాల్ ధాక్కర్ (ఆర్టికల్ 370)

అంచనాలు రెట్టింపు



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు పి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ టీజర్‌ని రిలీజ్ చేశారు. సినిమాలను, ఆంధ్ర కింగ్‌ను ఆరాధించే పాత్రలో రామ్ ఒదిగి పోయారు. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేశ్, తులసి బాగా నటించారు. ఆసక్తికర సంభాషణలతో మురళీ శర్మ ఆకట్టుకున్నారు. కాగా, ఈ చిత్రంలో ఉపేంద్ర ఆన్ స్క్రీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. మొత్తానికి టీజర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

శ్రీకాంత్ అయ్యంగార్ క్షమాపణలు



మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్.. ఆదివారం సోషల్‌మీడియా వేదికగా క్షమాపణలు తెలిపారు. ఇటీవల నేను చేసిన కొన్ని వ్యాఖ్యలు మీ మనోభావాలను దెబ్బతీశాయి. అది నా ఉద్దేశం కాదు. మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమాపణలు. అలాగే, మన దేశానికి స్వాతంత్ర్యం అందించడం కోసం పాటుపడిన మహావీరులందరికి మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను. జై హింద్ అని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌పై 'మా'లో ఫిర్యాదు

మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు శ్రీకాంత్ అయ్యంగార్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలె సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆయన మా (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణుకు శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ అనేది అందరికీ ఈ కాలంలో ఓ ఫ్యాషన్‌గా మారిపోయింది. 'మా' క్రమశిక్షణ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటాం' అని 'మా' జనరల్ సెక్రటరీ శివబాలాజీ అన్నారు.

నటి డయాన్ కీటన్ కన్నుమూత



ఆస్కార్ విజేత, హాలీవుడ్ దిగ్గజ నటి డయాన్ కీటన్(79) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం తుదిశ్వాస విడిచారు. దాదాపు ఐదు దశాబ్దాలు తన నట జీవితాన్ని కొనసాగించిన ఆమె హాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆమె నటించిన 'అనీ హాల్' సినిమాకు ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. 'ది గాడ్‌ఫాదర్' సిరీస్ ఆమెకు గ్లోబల్ స్టార్‌డమ్‌ని తెచ్చిపెట్టింది. డయాన్ ధరించిన ప్రత్యేకమైన సూట్లు, టోపీలు ఫ్యాషన్ ప్రపంచంలో ఓ కొత్త ఒరవడిని సృష్టించాయి.

ఆలోచింపజేసే చిత్రం



రోహిణి హట్టంగడి, రోహిణి ముల్లేటి, సముద్రఖని, హిమాంశు పోఫూరి, సౌమ్య, అనన్య నన్నపనేని ప్రధాన పాత్రధారులుగా అక్కినేని కుటుంబరావు తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఒక మంచి ప్రేమ కథ'. హిమాంశు పోఫూరి నిర్మాత. ఈ మూవీకి కథ, మాటలు, పాటల్ని ఓల్గా అందించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. చిత్ర దర్శకుడు అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ 'కోట్లు సంపాదించేందుకు పరుగులు పెడుతున్నారు. కానీ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదు. అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా నవ్విస్తూ, ఏడ్పించేలా సినిమా తీశాను' అని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ 'పెద్దవాళ్లందరూ కలిసి నటించిన చిత్రమే అయినా ఇది యువతరానికి సంబంధించిన కథ' అని చెప్పారు. నిర్మాత హిమాంశు పోఫూరి మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నటి రోహిణి హట్టంగడి, నటి రోహిణి ముల్లేటి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షకుడి కథ



మాస్టర్ మహేంద్రన్, అంబికావాణి ప్రధాన పాత్రధారులుగా వైకుంఠ్ బోను తెరకెక్కిస్తోన్న చిత్రం 'వసుదేవసుతం'. రెయిన్‌బో సినిమాస్ బేనర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని కథానాయకుడు సత్యదేవ్ ఆవిష్కరించారు. 'ఈ కథ.. ధర్మానికి అడ్డొస్తే..మేనమామ అయినా, లక్షల బంధుగణమైనా, ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా...ధర్మ హింస తథైవచ అన్న శ్రీకృష్ణుడిదే కాదు. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణహోమానికైనా ఎదురెళ్లే ఓ యువకుడిది ' అనే శక్తిమంతమైన సంభాషణలతో ప్రారంభమైన టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి డీఓపీ : జిజ్జు సన్నీ, సంగీతం: మణిశర్మ.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

నూతన ఉపాధ్యాయులకు అభినందన

గుడివాడ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడ పట్టణ, రూరల్ మండలానికి నూతన ఉపాధ్యాయులుగా 37 మంది సోమవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు ఎంఈవో -1 రజనీ తెలిపారు. గుడివాడ రూరల్ మండలానికి ఆరుగురు ఉపాధ్యాయులు, గుడివాడ పట్టణానికి 31 మంది ఉపాధ్యాయులు సోమవారం జాయిన్ అవుతున్నారని తెలిపారు. నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అభినందనలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు.



కొండాలమ్మకు పాలపొంగళ్లు వండుతున్న భక్తులు

కొండాలమ్మకు పాల పొంగళ్లు

గుడ్లవల్లేరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారిని 30 వేల మంది భక్తులు దర్శించుకొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆదివారం వేకువజాము నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి చేరుకొన్నారు. మహిళలు పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ఆర్థిక సాయం

పెదపారుపూడి : పాములపాడు శివారు దూళ్లవానిగూడెంలో పలు కుటుంబాలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరామర్శించి ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయమందించారు. గ్రామానికి చెందిన చేబ్రోలు తమ్మకుమార్, నక్క శ్రీను కుటుంబసభ్యులను పరామర్శించి పీ4 పథకం ద్వారా ఆర్థికసాయమందించారు. అనంతరం అప్పికట్లలో కొల్లు రామచంద్ర ప్రసాద్ కుమారుడు రిసెప్షన్‌లో పాల్గొని వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాచూరి ప్రభుదాస్ , పాతూరి బసవయ్య, దూళ్ల జెమిబాబు, దాసి రమేష్, అభిమన్యుడు, పాల్గొన్నారు.

కూచిపూడి : పెదముత్తేవిలోని శ్రీకృష్ణాశ్రమాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో జరుగుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేకు వివరించారు. కృష్ణాశ్రమ నిర్వాహకులు ముత్తేవి గౌరవ కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు మెమొంటో అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు.

ఆక్రమణల చెరలో పీహెచ్‌సీ రోడ్డు

● అభివృద్ధికి నోచుకోని రహదారి
● రాకపోకల సమయాల్లో తప్పని తిప్పలు
● పట్టించుకోని అధికారులు

(తోట్లవల్లూరు - ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు పీహెచ్‌సీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు సందిగ్ధంగా మారింది. ఈ రోడ్డులో సర్వేచేసి హద్దులుగా కాంక్రీటు పిల్లర్‌లు పోసి అలాగే వదిలేయటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తోట్లవల్లూరు మెయిన్ సెంటర్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఉత్తరం వైపుగా పీహెచ్‌సీ వరకు పంచాయతీ రోడ్డు ఉంది. ఈ రోడ్డు 20 నుంచి 25 అడుగుల వరకు ఎఫ్ఎంబీ రికార్డుల్లో ఉంది. మలుపుల వద్ద 28 అడుగుల వరకు ఉంది. అయితే ఈ రోడ్డు ఆక్రమణలకు గురయి పది అడుగుల వరకు మాత్రమే ఉంది. రెండు వాహనాలు ఎదురొస్తే తప్పుకోవటానికి ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. రోడ్డు అభివృద్ధికి నోచుకోకుండా మిగిలిపోయింది.

ఈ పరిస్థితిపై తోట్లవల్లూరుకు చెందిన మాకినేని దశరధరావు అనేక సంవత్సరాల నుండి వినతి పత్రాలు సమర్పిస్తు వచ్చారు. వందలమంది రాకపోకలు సాగించే రోడ్డులో ఆక్రమణలు తొలగించి సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దాంతో 2022 ఫిబ్రవరిలో ఒకసారి సర్వేకి వచ్చిన అధికారులు మొక్కుబడి చర్యలతో వదిలేశారు. దశరధరావు మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళగా ఈ ఏడాది ఏప్రిల్ 25న పంచాయితీ, మండల అధికారులు రోవర్స్ సర్వే చేసి కాంక్రీటు పిల్లర్‌లతో పటిష్టంగా హద్దులు వేశారు. ఏప్రిల్లో హద్దులు వేసి ఆక్రమణలు తొలగించకుండా వదిలేశారు.



సీబీసీఎస్‌సీ పాఠశాల వద్ద పంచాయతీ అధికారులు సర్వేచేసి నిర్మించిన పిల్లర్



రోడ్డుకు మరోవైపున హద్దుగా నిర్మించిన కాంక్రీటు పిల్లర్

దాంతో గుడివాడ డివిజనల్ పంచాయితీ అధికారికి దశరధరావు లేఖ రాయటంతో ఆగస్టు 22న పంచాయితీ, మండల పరిషత్ అధికారులకు మెమో పంపి పది రోజుల్లో ఆక్రమణలు తొలగించలని ఆదేశించారు. కాని రోడ్డులోకి వచ్చిన ఆక్రమణలను తొలగించటం లేదని దశరధరావు తెలిపారు. డీఎల్‌పీవో ఆదేశాలను సైతం అధికారులు పట్టించుకోవటం లేదని, 16 గ్రామాల ప్రజలకు ఉపయోగపడే రోడ్డుని అధికారులు సర్వేతోనే వదిలేయటంతో ఎలాంటి ఉపయోగం లేకుండా ఉందన్నారు.

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపడతాం

పీహెచ్‌సీ రోడ్డె ఆక్రమణకు గురైన సంగతి వాస్తవమే. రోడ్డువెంట 20 ఆక్రమణలను గుర్తించాం. వారందరికీ నోటీసులు జారీచేసి ఆక్రమణలను తొలగించాలని సూచిస్తాం. మూడు నోటీసులకు స్పందన లేకుంటే తామే తొలగించేందుకు ఉపక్రమిస్తాం.

ఆర్ శ్రీనివాసరావు ,పంచాయతీ కార్యదర్శి



భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

గుడ్లవల్లేరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులో వేంచేసియున్న భూదేవి సమేత వేంకటేశ్వర సామి ఆలయంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక వేంకటేశ్వర స్వామి వ్రతాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కళ్యాణ వేడుకల్లో, వ్రతాల్లో పాల్గొన్నారు.

జనార్దనరావుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి

గుడివాడ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోటూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జనార్ధనరావుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. శనివారం రాత్రి డిప్యూటీ ఎంపీడీవోగా ప్రమోషన్ ఇస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి వచ్చినందుకు పలువురు అభినందించారు.

విద్యావేత్త గుత్తా రమేష్ లేని లోటు తీర్చలేనిది

● మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు

గుడివాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : విద్యావేత్తగా గుత్తా రమేష్ అందించిన సేవలు మరవలేనివని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణపురంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో మాజీ ఎంఈవో గుత్తా రమేష్ దశదినకర్మ నిర్వహించారు. గుత్తా రమేష్ జీవితచరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ విద్యావేత్తగా గుత్తా గుడివాడ, నందివాడ మండలాల్లో ఎనలేని సేవలందించారన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులుగా గుత్తా కీలకంగా వ్యవహరించి అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచి యువత ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుత్తా రమేష్ కుమారులు రతన్ ప్రసాద్, ఫణి ప్రసాద్, మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ శాఖ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ వేణుగోపాలరావు, సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, జిల్లా కమిటీ, గుడివాడ శాఖ సభ్యులు పాల్గొన్నారు. మావనతా స్వచ్ఛంద సంస్థకు వెన్ననపూడికి చెందిన ప్రసాద్ రూ.5వేలు, గుత్తా రమేష్ శిష్యులు విజయభారతి రూ.1,116లు విరాళంగా అందజేశారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు

ప్రమాదకరంగా వన్నేరు గట్టు

పెదపారుపూడి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోపర్రు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి నందివాడ సత్రం రోడ్డు వన్నేరు గట్టు జారిపోయింది. గతేడాది వరద రావటంతో వన్నేరు గట్టు తెగి గ్రామంలోకి నీరు వచ్చి గ్రామ ప్రజలను పెదపారుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లకు తరలించారు. ఆ గట్టుపై కర్రలు పాతి మట్టి పోసినప్పటికీ జారిపోయింది. ప్రధానమైన రహదారి కావటంతో ప్రజలు నిత్యం ఈ రహదారి వెంట ద్విచక్ర వాహనాలు రవాణాకు అంతరాయం కలుగుతుంది. గతంలో ఈ యాక్సిడెంట్లు సైతం అయ్యాయి. రాబోయే రోజుల్లో వ్యవసాయ పనులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాల్వలోకి జారిపోయిన వన్నేరు గట్టు

అధికారులు పట్టించుకోవడం లేదు

మోపర్రు గ్రామం ప్రధాన రహదారి వన్నేరు గట్టు జారిపోవటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి వెంట ప్రయాణం చేయాలంటే భయాందోళన చెందుతున్నారని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. వర్షం కురిస్తే రహదారిలో ప్రయాణించటమే కష్టంగా ఉంది.

సాంబశివరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు

వన్నేరు గట్టు పటిష్టంగా చేయాలి

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన్నేరు గట్టు వేశారు. కానీ జారిపోయింది పటిష్టంగా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జూపల్లి రాజేష్, గ్రామస్థుడు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

గుడివాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గుంటూరులోని ఎస్‌జీవోస్ కల్యాణమండపంలో శనివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ అసోసియేషన్(డమోక్రటిక్) ఆధ్వర్యంలో గురుదేవోభవ పురస్కార్ అవార్డు ప్రదానం కార్యక్రమంలో స్థానిక విద్యావికాస్ పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావును ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్సా రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి అప్సా జిల్లా కమిటీ సభ్యులు బొప్పన విజయభాస్కర్, పుట్టి రామచంద్రశేఖర్, సజ్జా అనీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డునందుకున్న కొమ్మినేనిని ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రిన్సిపాల్స్ ఆశీర్వాదం, నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.



కొమ్మినేనిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి తదితరులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● ఎంపీడీవో కె.జ్యోతి

పామర్రు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలను తీర్చిదిద్దడంతోపాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలు అంతా భాగస్వాములుగా నిలిచి కేంద్ర ప్రభుత్వ లక్ష్యసాధనకు తోడ్పడాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. స్థానిక నాలుగు రోడ్లకూడలి సమీపంలోని ఒకటో గ్రామ సచివాలయం ఆవరణలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మితమైన సామాజిక మరుగుదొడ్లను కార్యదర్శి అబ్దుల్‌సలీమ్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సామాజీక మరుగుదోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని శానిటరికి ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరి సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.



సామాజిక మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోతి

నిర్గన్‌షా ఔలియా బాబా దర్గాలో ఎమ్మెల్యే కాగిత ప్రార్థనలు

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌పేట హజ్రత్ నిర్గన్‌షా ఔలియా బాబా దర్గాలో ఆదివారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసిన అన్నసమారాధన చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు డీసీ చైర్మన్ పోతన స్వామి, దర్గా కమిటీ చైర్మన్ ఎండీ యాసీన్, టీడీపీ నేత గోపి నాగబాబు, ఎన్ఎబేగ్, బాసంశెట్టి విజయ్, శ్రీను, వేణు, బేతాళ స్వామి, రెహ్మాన్, ఎజ్జు శివాజీ, పాల్గొన్నారు.



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పిన్నమనేని

కనకదుర్గమ్మ ఆలయంలో అన్నదానం

గుడివాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన శాంతి నిమిత్తం అన్నసమారాధన నిర్వహించడం అభినందనీయమని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) అన్నారు. ఆదివారం స్థానిక 31వ వార్డు రైల్వేస్టేషన్ రోడ్డులో కనకదుర్గమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తొలుత అమ్మవారికి పిన్నమనేని బాబ్జీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణ(నాని), స్థానికులు బొంబాయి శ్రీను, వెంకట్రావు, చింతపల్లి ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, శౌరిబాబు, నాని, భక్తులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉదయ్‌కుమార్

చల్లపలి : నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్‌గా మంగళాపురం గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త రావెళ్ల ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ మహతబ్‌రాయ్ ఆదేశాలతో ఆల్ ఇండియా ఇన్‌చార్జి సర్వేందర్, ఆంధ్రప్రదేశ్ చైర్మన్ చిట్టిబాబు, తెలంగాణ చైర్మన్(ఎడ్యుకేషన్) ప్రొఫెసర్ డాక్టర్ తోడేటి శ్రీకాంత్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని ఉదయ్‌కుమార్ తెలిపారు.

మినీ గోకులానికి భూమిపూజ

అవనిగడ్డ రూరల్ :తిప్పపాలెంలో పాడి రైతు కమ్మిలి శ్రీనివాసరావుకు రూ.2 లక్షలతో మంజూరైన మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం భూమి పూజ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖ ద్వారా గ్రామీణాభివృద్ధికి, పల్లెసీమల ప్రగతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో అత్యధిక సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 88 మినీ గోకులం షెడ్డు మంజూరైనట్లు తెలిపారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, పీఏసీఎస్ అధ్యక్షుడు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, ఏపీవో రవికుమార్, నాయకులు బొప్పన బాబూజీ, కమ్మిలి సాయి భార్గవ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

పామర్రు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): పామర్రులో వేంచేసి యున్న అయ్యప్ప సన్నిధానంలో ఆదివారం కేరళ తాంత్రి పద్మనాభం నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజాదికాలు, హోమంలో, విశేష అభిషేకాలను స్థానిక అక్షయ సీఫుడ్స్ అధినేత నేరెళ్ల రఘు,బ అపర్ణాదేవి దంపతులు స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన అయ్యప్పదీక్షా పరులు400మందితోపాటు, ఇతర భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణుఘోషలతో మరుమోగింది. ఆలయ నిర్మాణాదాతలైన తాడిశెట్టి పూర్ణయ్య, నాగేశ్వరరావు(పాము)వంశస్థులు భక్తులకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో చింతల ఉదయ్‌కిరణ్,సూర్యరాజు, పలువురు అయ్యప్ప గురుస్వాములు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రఘు, అపర్ణదేవి దంపతులు



ఉపాధ్యాయులు, కానిస్టేబుల్స్‌గా ఎంపికైన వారిని సన్మానించిన యువనేత మండలి వెంకట్రామ్

ఉపాధ్యాయ, పోలీసు ఉద్యోగాల విజేతలకు జనసేన సన్మానం

చల్లపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు, కానిస్టేబుల్స్‌గా ఎంపికైన అభ్యర్థులను ఆదివారం రాత్రి జనసేన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రామ్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తెలిపారు. మండలంలో 23 మంది ఉపాధ్యాయులుగా, ఆరుగురు కానిస్టేబుల్స్‌గా ఎంపిక కావటం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జి.వి.తాతారావు అధ్యక్షతన జరిగిన సభలో చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, వైస్ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ప్రముఖులు గురవయ్య, స్వభూప్రసాద్, పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు లేకుండా చూసుకోవాలి



చలానాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

● ఎస్సై రాజేంద్ర ప్రసాద్

పామర్రు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): రోడ్లపై నడిచే వాహనాలపై పెండింగ్ చలానాలు లేకుండా చూసుకోవాలని ఎస్సై రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ద్విచక్రవాహనాదారులకు ట్రాఫిక్ నిబంధనలతోపాటు పెండింగ్ చలానాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాదారులు లైసెన్సు,హెల్మెట్ తప్పనిసరిగా కలిగి యుండాలని సూచించారు. మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోనున్నామన్నారు. ట్రైనీ ఎస్సై సత్యకళ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేద వర్గాలకు వరం సీఎంఆర్‌ఎఫ్

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం గొప్ప వరమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ, పెదపూడి, భట్లపెనుమర్రు గ్రామాలకు చెందిన వ్యక్తులకు ఆదివారం ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. మొవ్వ గ్రామానికి చెందిన వీర్ల నాగేశ్వరరావుకు రూ.47 వేలు, పెదపూడికి చెందిన బాదర్ల రాజేశ్వరీకి రూ.24 వేలు, భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన అంగడాల వెంకటేశ్వరరావు రూ.30 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, వీరంకి తులసీదాస్, మండవ రత్నగిరిరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మొవ్వలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల : లంకపల్లి గ్రామానికి చెందిన దోనేపూడి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా స్వయంగా బాధితుని ఇంటికి వెళ్లి 1.85లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ పత్రాన్ని అందించారు. వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే కుమార్ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : పెనమకూరులో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముత్తిరెడ్డి కోటేశ్వరరావుకి రూ. 1,10,000, కాగిత వెంకటేశ్వరమ్మకు రూ. 45వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల టీడీపీ అధ్యక్షుడు వీరనేని శివరామ్‌ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూడపాటి గిరిబాబు, మా వైస్ ఎంపీపీ వీరంకి వరహాలరావు, రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వీరంకి పరశురామ్, పామర్తి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



పెనమకూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న శివరామ్‌ప్రసాద్



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525



పాలకాయతిప్పలో రోడ్లపై మురుగు నీరు

కోడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాలకాయతిప్పలో రోడ్లు నిర్మించిన అధికారులు డ్రైనేజీని విస్మరించారు. డ్రైనేజీ లేకపోవటంతో మురుగు నీరు రోడ్లపై నిలిచి దోమలు వృద్ధి చెంది విషజ్వరాల బారిన పడుతున్నామని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

మినీ గోకులానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భూమిపూజ



అవనిగడ్డ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):తిప్పపాలెంలో పాడి రైతు కమ్మిలి శ్రీనివాసరావుకు రూ.2 లక్షలతో మంజూరైన మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం భూమి పూజ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖ ద్వారా గ్రామీణాభివృద్ధికి, పల్లెసీమల ప్రగతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో అత్యధిక సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 88 మినీ గోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, పీఏసీఎస్ అధ్యక్షుడు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, ఏపీవో రవికుమార్, నాయకులు బొప్పన బాబూజీ, కమ్మిలి సాయి భార్గవ, గ్రామస్థులు పాల్గొన్నారు.



నిర్గన్‌షా బాబా దర్గాలో ఎమ్మెల్యే కాగిత ప్రార్థనలు

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌పేట హజ్రత్ నిర్గన్‌షా ఔలియా బాబా దర్గాలో ఆదివారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసిన అన్నసమారాధన చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు డీసీ చైర్మన్ పోతన స్వామి, దర్గా కమిటీ చైర్మన్ ఎండీ యాసీన్, టీడీపీ నేత గోపి నాగబాబు, ఎన్ఏబేగ్, బాసంశెట్టి విజయ్, శ్రీను, వేణు, బేతాళ స్వామి, రెహ్మాన్, ఎజ్జు శివాజీ, కటకం నాగమల్లేశ్వరరావు, వాకా శ్రీను, గొరిపర్తి బుచ్చిరాజు, అట్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభం



లక్ష్మీ హ్యాండ్ లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాయవరంలో లక్ష్మీ హ్యాండ్ లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీని ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగటానికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మునగాల భాస్కర్, మండల టీడీపీ అధ్యక్షులు పోతన స్వామి, బిజెపి మండల అధ్యక్షులు కోలపల్లి రజని, గోపి నాగబాబు, భవనారాయణ, ఎస్ఏ బేగ్, మునగాల నరసింహారావు, చిన్నం వెంకటేశ్వరరావు, మురాల ధనుష్, అబ్దుల్లా బేగ్, కోలపల్లి జగదీష్, గల్లా నాగేశ్వరరావు, గొల్ల వెంకట సుబ్బారావు, కొండేటి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉదయ్‌కుమార్



రావెళ్ల ఉదయ్‌కుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

చల్లపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్‌గా మంగళాపురం గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త రావెళ్ల ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ మహతబ్‌రాయ్ ఆదేశాలతో ఆల్ ఇండియా ఇన్‌చార్జి సర్వేందర్, ఆంధ్రప్రదేశ్ చైర్మన్ చిట్టిబాబు, తెలంగాణ చైర్మన్(ఎడ్యుకేషన్) ప్రొఫెసర్ డాక్టర్ తోడేటి శ్రీకాంత్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని ఉదయ్‌కుమార్ తెలిపారు.



మండలి కృష్ణారావుకు ఘననివాళి

నాగాయలంక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శత జయంతి ఉత్సవాలలో భాగంగా 70వ రోజు ఆదివారం నాగాయలంకలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి హైకోర్టు న్యాయవాది భోగాది శివ నాంచారయ్య నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, మండలి ఉదయ భాస్కర్, గుడివాక శివాజీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారి



పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా ఉన్న పులిగడ్డ చేపల మార్కెట్‌కు వెళ్లే రోడ్డు

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ చేపల మార్కెట్‌కు వెళ్లే అంతర్గత రహదారి పూర్తిగా అధ్వానంగా ఉండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారు. పులిగడ్డ పంచాయతీ పరిధిలో దాదాపు 32 రహదారులను అభివృద్ధి చేసిన అధికారులు, పాలకులు ఈ రహదారిని మరచిపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి అధ్వానస్థితిలో ఉన్న అంతర్గత రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఘనంగా కుంతీదేవి పండుగ

ఘంటసాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చిలకలపూడి దళితవాడలో కుంతీదేవి పండుగను ఆదివారం ఘ నంగా నిర్వహించారు. కుంతీదేవికి, నందీశ్వరునికి విశేష పూజలు చేశారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, న్యాయవాది కర్రా నాగరాజు, టీడీపీ నేత మేడికొండ విజయ్ అమ్మవారిని దర్శించుకోగా, గ్రామస్థులు వారిని సత్కరించారు. బాలు, నాగరాజు, మల్లి, అశోక్, కరణం, ప్రశాంత్ పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ - సూపర్ హిట్ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కనపర్తిలను సన్మానిస్తున్న చల్లపల్లి టీడీపీ నేతలు



గూడూరు గ్రంథాలయం వద్ద జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారులు, టీడీపీ నేతలు

కూటమి ప్రభుత్వ సేవలను ప్రజలకు వివరించాలి

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

చల్లపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తోందని ఆర్టీసీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. పురిటిగడ్డలో టీడీపీ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ - సూపర్ హిట్ కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొనకళ్ల మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు తెలియచేయాలన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి నెలవారీ ఖర్చుల్లో డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో కార్పొరేషన్‌ల రాష్ట్ర డైరెక్టర్లు పైడిపాముల కృష్ణకుమారి, బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు రాజులపాటి అంకమ్మ, మాలెంపాటి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, సొసైటీ చైర్మన్లు పెద్దిబోయిన హరనాథ్, గుత్తికొండ వంశీకృష్ణ, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, కైతేపల్లి శ్రీనివాసరావు, మాతంగి వేణు, తొట్టెంపూడి చినరంగారావు, పరుచూరి సురేష్, దేవభక్తుని గోపాలకృష్ణ, రాజులపాటి జగదీష్, ముమ్మనేని నాని, మోర్ల శివ, కొర్రపాటి బుజ్జిమ్మతోపాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. పురిటిగడ్డ సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డప్పు కళాకారుల స్వాగతం పలికారు. కొనకళ్ల, కనపర్తిలను గజమాలతో సన్మానించారు. కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నియమితులైన కృష్ణకుమారి, నాగమణి, స్వప్నలను సత్కరించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

గూడూరు : గూడూరు శాఖా గ్రంథాలయంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, జీఎస్టీ రేట్లపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకట రమణ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయని, రోజు వారి ఉపయోగించే వస్తువులపై చాలా వరకు ఆదా అవుతుందన్నారు. పెనుగొండ శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి దాసరి వెంకట నాగరవి, పాఠకులు పాల్గొన్నారు.



బందరులో నేత్రపరీక్షలు చేస్తున్న డాక్టర్ భానుమూర్తి



చల్లపల్లిలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..



కోడూరులో...



నాగాయలంకలో..

నేత్రాల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేత్రాల ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. హ్యూమానిటీ ఫౌండేషన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సన్‌స్టార్ స్కూలులో ఆదివారం ఉచిత నేత్ర వైద్యసేవా శిబిరాన్ని గోపీ చంద్ ప్రారంభించారు. 162 మందికి నేత్ర పరీక్షలు జరిపారు. ఎనిమిది మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని డాక్టర్ భానుమూర్తి గుర్తించారు. హ్యూమానిటీ ఫౌండేషన్ అధ్యక్షురాలు నూర్జహాన్ అధ్యక్షత వహించిన శిబిరంలో కేన్సర్‌తో బాధపడుతున్న హర్షవర్ధన్‌కు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు, స్టార్ సంస్థల అధినేత పి.శ్రీరాం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ భానుమూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నేత్ర వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పి.శ్రీరాం మాట్లాడుతూ, ఉచితంగా కళ్లజోళ్ళు ఇస్తారన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ సల్మా, మానవతా మచిలీపట్నం ఉపాధ్యక్షుడు బొమ్మిడి అయ్యప్పస్వామి, ఆదిత్య, కార్యదర్శి హసీంబేగ్, పివి ఫణికుమార్, కె.రాజేంద్రప్రసాద్, అజ్మతున్నీసా, కృష్ణమోహన్, కోటి, కిశోర్, చిట్టికుమారి పాల్గొన్నారు.

చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 177వ ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. 80 మందిని డాక్టర్ బి.మోహనరావు పరీక్షించి 28 మందిని ఐవోఎల్ ఆపరేషన్లకు ఎంపికచేశారు. వీరికి విజయవాడ అమరావతి ఆసుపత్రిలో ఉచితంగా కంటిపరీక్షలు చేయించటం జరుగుతుందని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం తెలిపారు. చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వరదా హరిగోపాల్ ఆర్థికసహకారంతో శిబిరం జరిగింది. క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ 7500 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు హరిగోపాల్ తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ 320 మంది నుంచి కార్నియాల సేకరణతో 640 మందికి చూపును ప్రసాదించటం జరిగిందన్నారు. వాసవీక్లబ్ నేతలు కొల్లిపర నరేంద్ర, వరదా రాజశేఖర్, ఉరిమి రమేష్, మలిశెట్టి చెంచురాములు, సువర్చల, జ్యోతి, కుసుమ తదితరులు పాల్గొని సేవలందించారు.

కోడూరు : కోడూరులోని ప్రముఖ వైద్యులు యద్దనపూడి గోపాలకృష్ణ హస్పటల్, విజయవాడకు చెందిన అమరావతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రికి చెందిన డాక్టర్ వేణు నాదెళ్ల, శైలజ కేతినేని 150 మందికిపైగా రోగులకు కంటి పరీక్షలు చేశారు. యద్దనపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెలా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించటంతోపాటు ఉచిత వైద్యశిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజేష్ పాల్గొన్నారు. **నాగాయలంక,** : శంకరా కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు ఆర్థిక సౌజన్యంతో డాక్టర్ శ్యామ్‌దీప్ 90 మందికి కంటి పరీక్షలు చేశారు. 65 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. శిబిరం ఇన్‌చార్జ్ రవి, తలశిల లీలా మనోహర్, మత్తి శివ, కనిగంటి అజయ్ పర్యవేక్షించారు.



విషప్రయోగం జరిగిన చెరువును పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

చెరువులో విష ప్రయోగం చేసిన వారిని శిక్షించాలి

కోడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కక్ష పూరిత కుట్రలతో చెరువులో విష ప్రయోగం చేయటం సరికాదని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పోటుమీద గ్రామ టీడీపీ నేత బావిశెట్టి సురేష్ రొయ్యల చెరువులలో విషప్రయోగం జరిగిందని తెలిసి ఆదివారం పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. వ్యక్తిగత కక్షలతో విష ప్రయోగం చేసిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. కొల్లూరు వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, అపికట్ల రవీంద్ర, పిల్లి మల్లిఖార్జునరావు, వేములపల్లి రాజేష్, ఉప్పాల పోతురాజు, ఉప్పాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి దుర్గకు టీడీపీ నివాళి

కోడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోడూరు శివారు ఇంటిమీద గ్రామ టీడీపీ నాయకులు గుమ్మడి సాంబశివరావు భార్య గుమ్మడి దుర్గ ఇటీవల అనారోగ్యం మృతి చెందారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు ఆదివారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, అపికట్ల రవీం ద్ర, పిల్లి మల్లిఖార్జునరావు, వేములపల్లి రాజేష్, ఉప్పాల పోతురాజు, ఉప్పాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఘంటసాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మల్లాయి చిట్టూరు గ్రామంలో ఆదివారం రాఫా ప్రథమ చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నానికి చెందిన డాక్టర్ సురమ్ వెంకట గణేష్ ఆధ్వర్యంలో 95 మంది రోగులకు ఉచిత వైద్యసేవలు అందించారు. ఘంటసాల గ్రామానికి చెందిన పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో రూ.20 వేల విలువ గల మందులను ఉచితంగా అందజేశారు. నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల ధర్మవెంకట నరసయ్య, ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు కిరణ్, సుకన్య, పాస్టర్ పి.ఎస్.రాజు, రాము, వెంకటరత్నం, అహ్మద్, పార్థు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయానికి కంప్యూటర్ల వితరణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శిక్షణ ఫౌండేషన్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందజేసిన కంప్యూటర్లు, ఎల్ఈడీ మానిటర్లు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ఆదివారం ప్రారంభించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకట రమణ, పి.వి. ఫణికుమార్, ఇంటింటికి జీఎస్టీ ఫలాలు అందుతాయన్నారు. గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫర్నీచర్ వితరణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హ్యాపీ హోం గరల్స్ హాస్టల్‌కు ఆదివారం మైత్రీ ఫౌండేషన్ ఫర్నిచర్‌ను వితరణగా అందజేసింది. బెల్ రిటైర్డు ఉద్యోగి మహమ్మద్ ఖాజా జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఖుర్షీద్ బేగం, కైసర్ సుల్తానా రూ.10 వేలు విలువ గల కుర్చీలు, బల్లలు అందజేశారు. అధ్యక్షుడు వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వరప్రసాద్, రమణ, బి.వి.రావు, లతాకుమారి తదితరులు పాల్గొన్నారు.



శరన్నవరాత్రుల అన్నసమారాధన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా ఆదివారం కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో భారీ అన్నసమారాధన జరిగింది. మామిడి మురళీకృష్ణ, బాబాప్రసాద్, సామా వెంకట లక్ష్మీకాంతారావు, ఉడత్తు శ్రీనివాసరావు, బైసాని హయగ్రీవరావు, మెహర్‌ప్రసాద్, ఉడత్తు కిషోర్ పాల్గొన్నారు. కాసానిగూడెంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. శక్తిపటాలు ఆలయ కమిటీ సభ్యులు మరీదు తార, రాజులపాటి రాంబాబు, కార్తీక్, వంకా వినోద్, మరీదు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కళ్యాణం

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేకనూరులో ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి శాంతి కళ్యాణం వైభవంగా జరిగింది. గంగులాల్ మోహనరావు - లక్ష్మీ దంపతులు పీటల మీద కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం మత్తి సురేష్ ఆర్థిక సాయంతో అన్నదానం జరిగింది. ఆలయ ధర్మకర్తలు తుంగల వీర వసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఉపాధ్యాయ, పోలీసు ఉద్యోగాలు సాధించిన విజేతలకు జనసేన పార్టీ సన్మానం

చల్లపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు, కానిస్టేబుల్స్‌గా ఎంపికైన అభ్యర్థులను ఆదివారం రాత్రి జనసేన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రామ్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తెలిపారు. మండలంలో 23 మంది ఉపాధ్యాయులుగా, ఆరుగురు కానిస్టేబుల్స్‌గా ఎంపిక కావటం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జి.వి.తాతారావు అధ్యక్షతన జరిగిన సభలో చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, వైస్‌ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ప్రముఖులు అడపా గురవయ్య, ఆకుల స్వభూప్రసాద్, షేక్ నసీంఫెూరి, నారంశెట్టి వెంకటేశ్వరరావు, అడపా రవి, సూదాని నందగోపాల్, చంద్రశేఖరరావు, రావి రాజేశ్వరరావు, గోళ్ల ప్రసాద్, సూదాని పూర్ణ, నల్లమోతు వీరయ్య పాల్గొన్నారు.